ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

శనివారం 17 అక్టోబర్ 2026 | Saturday 17 octobar 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 181 | Vol.No 28 Issue No .181 | Hyderabad | www.visionandhra.in

హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం..
- త్వరలోనే భూమిపూజకు సిద్ధం..
- పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- తెలంగాణలో తయారీ రంగానికి అన్ని విధాలా సహకరిస్తాం: సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 16: తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (ఎవీ×జు) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్ (చీ×వీ)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678

మిగతా 2లో..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను

మిగతా 2లో..



పతనమవుతున్న రూపాయిని కాపాడేందుకు ఆర్‌బీఐ భారీ యజ్ఞం

- 80 బిలియన్ డాలర్లు ఆవిరి!
- విదేశీ మారక నిల్వల్లో దాదాపు సగం ఖర్చు చేసిన రిజర్వ్ బ్యాంక్
- సంచలన నిజాలు బయటపెట్టిన రాయిటర్స్!
- 734.6 బిలియన్ డాలర్లకు పడిపోయిన భారత్ ఫారెక్స్ రిజర్వ్స్
- గరిష్ట స్థాయి నుంచి 51 బిలియన్ డాలర్లు డౌన్!

మిగతా 2లో..

జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
- విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు
- విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్

మిగతా 2లో..

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో..

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..

- 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్
- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు ప్రణాళికలు లేవని మండిపాటు
- పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలించిందని వ్యాఖ్య

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

మిగతా 2లో..

తెలంగాణ పవర్ పాలిటిక్స్‌లో పెద్ద చిచ్చు!

- విద్యుత్ శాఖపై ఎవరి పెత్తనం? సచివాలయంలో ముదురుతున్న పవర్ వార్!
- సీఎం వేసిన కమిటీకి నో అంటున్న అధికారులు - యాదాద్రి లో సీక్రెట్ భేటీ!

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 16,విజన్ ఆంధ్ర : తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ లో అంతా బాగుంది అనుకుంటున్న సమయంలో అసలు కథ ఇప్పుడే మొదలైంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని, ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందని సచివాలయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీనికి కారణం ఒక్కటే.. తెలంగాణలో అత్యంత కీలకమైన, కోట్ల రూపాయల వ్యవహారం నడిచే విద్యుత్ శాఖ. తన శాఖలో సీఎం రేవంత్ రెడ్డి అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని, తన అధికారాలకు గండి కొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర అసహనంతో ఉన్నారని, ఈ వివాదం ఇప్పుడు బట్టబయలైందని

మిగతా 2లో..

రేవంత్ రెడ్డి అవినీతిపై

రాజగోపాల్ రెడ్డి డైరెక్ట్ ఎటాక్

- తెలంగాణలో 15% కమిషన్ రాజ్యమా?
- తెలంగాణ కంపెనీలకు పనులు దక్కకుండా ఆంధ్రా లాబీ కనుసన్నల్లో సర్కార్ నడుస్తోంది
- సీఎం సన్నిహితుడే ఫోన్ చేసి బెదిరించాడు!
- ఓటుకు నోటు కేసు నిందితుడే టెండర్ల బెదిరింపులకు - సుప్రీంకోర్టుకెళ్తా అంటున్న రాజగోపాల్!

తెలంగాణ స్టేట్ బ్యూరో,అక్టోబర్ 16, విజన్ ఆంధ్ర తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏకంగా తన సొంత ప్రభుత్వంపైనే, సీఎం రేవంత్ రెడ్డిపైనే అవినీతి బాంబు పేల్చారు. రేడియల్ రింగ్ రోడ్ ప్రాజెక్టులో వందల కోట్ల అవినీతి జరిగిందని, ఈ మొత్తం తతంగం వెనుక సీఎం హస్తం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

ఏపీ లాబీ చేతిలో తెలంగాణ సర్కార్
- రాజగోపాల్ సంచలన వ్యాఖ్యలు

రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ కంపెనీలకు పనులు దక్కకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ లాబీ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను నిర్ణయిస్తోంది. తెలంగాణ వచ్చింది తెలంగాణ కాంట్రాక్టర్లు బాగుపడటానికి కాదా? కానీ ఇక్కడ తెలంగాణ కంపెనీలను తొక్కేసి ఆంధ్రా కంపెనీలకు దోచిపెడుతున్నారు" అంటూ

మిగతా 2లో..

దేవీ నవరాత్రుల వేళ జోగులాంబ ఆలయంలో మూలా నక్షత్రం వైభవం

- ఆరవ రోజు కాత్యాయని రూపంలో దర్శనమిచ్చిన జగన్మాత
- సింహ వాహనంపై భక్తులకు అభయం!
- జోగులాంబ సన్నిధిలో కర్నూలు కళాకారుల కూచిపూడి నృత్య వైభవం
- అలంపూర్ ఆలయానికి పోటెత్తిన ప్రముఖులు - సినీ తారలు
- పూర్ణకుంభ స్వాగతం, పట్టు వస్త్రాల సమర్పణ!

తెలంగాణ స్టేట్ బ్యూరో,అక్టోబర్ 16,విజన్ ఆంధ్ర: దేవీ నవరాత్రుల పర్వదినాల సందర్భంగా అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయంలో మూలా నక్షత్రం పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే వేద మంత్రాల ఘోషతో, భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. దేవీ నవరాత్రుల్లో ఆరవ రోజు అమ్మవారు

మిగతా 2లో..

మేడిగడ్డ దగ్గర బాంబు పేలిన శబ్దం

- మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు సంచలన వ్యాఖ్యలు!
- కాంగ్రెస్ మంత్రుల సమక్షంలోనే బాంబు ప్రస్తావన
- మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు వెనుక కుట్ర కోణం?

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 16,విజన్ ఆంధ్ర :

మేడిగడ్డ బ్యారేజీ వివాదంలో సంచలన మలుపు. అప్పటి ఈఎన్సీ మురళీధర్ రావు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపుతున్నాయి. మేడిగడ్డ 7వ బ్లాక్ దగ్గర అక్టోబర్ 21, 2023న బాంబు పేలినట్లు పెద్దగా శబ్దం వచ్చిందని ఆయన స్వయంగా వెల్లడించడం కలకలం రేపుతోంది.

కాంగ్రెస్ మంత్రుల ముందే చెప్పిన మాజీ ఈఎన్సీ గురువారం కాంగ్రెస్ మంత్రుల సమక్షంలో జరిగిన ఒక సమావేశంలో మాజీ ఈఎన్సీ మురళీధర్

మిగతా 2లో..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

పతనమవుతున్న రూపాయిని కాపాడేందుకు ఆర్‌బీఐ భారీ యజ్ఞం

తెలంగాణ స్టేట్ బ్యూరో, న్యూఢిల్లీ, అక్టోబర్ 16,విజన్ ఆంధ్ర: దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న రూపాయి పతనం వెనుక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పతనమవుతున్న రూపాయి విలువను కాపాడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏకంగా 80 బిలియన్ డాలర్ల వరకు కుమ్మరించిందని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ సంచలన కథనాన్ని ప్రచురించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతుండటం, దాదాపు 90 మార్క్‌ను తాకడం దేశ ఆర్థిక వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో రూపాయి మరింత పతనం కాకుండా అడ్డుకోవడానికి ఆర్‌బీఐ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

140 బిలియన్లలో 80 బిలియన్లు ఖర్చు – అసలు లెక్క ఇదే!

రాయిటర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం.. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేసేందుకు ఆర్‌బీఐ గత కొన్నేళ్లుగా ప్రత్యేక చర్యల ద్వారా సమీకరించిన 140 బిలియన్ డాలర్లకు పైగా నిధుల్లో ఇప్పటికే దాదాపు సగం, అంటే 75 నుంచి 80 బిలియన్ డాలర్ల వరకు ఖర్చు చేసేసిందట! జూన్ 8 నుంచి ఇప్పటివరకు, అంటే కేవలం నాలుగు నెలల్లోనే ఈ మొత్తాన్ని రూపాయిని కాపాడేందుకు మార్కెట్లోకి వదిలినట్లు ప్రముఖ ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారని రాయిటర్స్ తన కథనంలో స్పష్టంగా పేర్కొంది. ఇది సాధారణ విషయం కాదు, చాలా భారీ మొత్తం అని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్టోబర్ 2 నాటికి 734.6 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ రిజర్వ్!

ఈ భారీ స్థాయిలో డాలర్లను విక్రయించడం వల్ల దేశ విదేశీ మారక నిల్వలు భారీగా తగ్గిపోయాయి. అక్టోబర్ 2 నాటికి భారత్ విదేశీ మారక నిల్వలు 734.6 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. గరిష్ట స్థాయితో పోలిస్తే ఇది దాదాపు 51 బిలియన్ డాలర్లు తక్కువ అని రాయిటర్స్ వెల్లడించింది. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ నిల్వలను ఇలా బలిపెట్టడం సరైన వ్యూహమా? లేక ఇంకా పతనం కొనసాగుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. డాలర్ బలపడుతుండటం, విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడం, అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి నెలకొనడం వంటి కారణాలతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..

రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

తెలంగాణ ప్రభుత్వం
శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము
ఇండ్లకోటయ్యగూడెం గ్రా. నిడమనూరు మం.॥, నల్లగొండ జిల్లా
టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రకటన

లేఖ నెం.01/ఎస్.కె.ఎమ్.టి./2026 తేదీ: 15.10.2026.

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము తేది: 28.10.2026 బుధవారము రోజున ఉదయం 10.00 గంటలకు శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము నందు దేవాదాయ - ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

క్ర.సం.	వేలము వివరము	డిపాజిట్ డి.డి.	కాలపరిమితి
01.	తలనీలాలు సేకరించుకొను హక్కు	రూ.2,00,000/-	01.11.2026 నుండి 31.10.2027 వరకు
02.	పోగు చేసిన తలనీలాల విక్రయం	రూ. 50,000/-	

కావున పైన తెలిపిన టెండర్-కమ్-బహిరంగ వేలం నిర్వహించుటకు క గంట ముందు ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్.7981570939 సంప్రదించగలరు.

ఇట్లు,
చెవిటి ఆంజనేయులు. ధొండర్ ట్రస్ట్
కె. భాస్కర్ సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ, నల్లగొండ
బి. జ్యోతి కార్యనిర్వహణాధికారి సెల్: 7981570939

DIPR R.O. No.: 12080-PP/CL/ADVT/2026-27 తేది:16-10-2026

దేవీ నవరాత్రుల వేళ జోగులాంబ ఆలయంలో మూలా నక్షత్రం వైభవం

కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయని అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఉదయం కళ్యాణోత్సవం – సాయంత్రం సింహ వాహన సేవ!

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి వేద పండితులు, అర్చకులచే శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి సింహ వాహన సేవ నిర్వహించారు. సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చిన జోగులాంబ అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని తరించారు.

కూచిపూడి నృత్యాలతో అలరించిన కర్నూలు బృందం!

వేడుకల్లో భాగంగా సాంస్కృతిక శోభ కూడా వెల్లివిరిసింది. శ్రీ నటరాజ కూచిపూడి నృత్య శిక్షణాలయం, కర్నూలులి వారి బృందంచే అమ్మవారి సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత ఆకర్షణీయంగా, భక్తి భావంతో సాగింది. చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ఆలయ ఈఓ శ్రీమతి దీప్తి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ప్రముఖులకు పూర్ణకుంభ స్వాగతం – పట్టు వస్త్రాల సమర్పణ!

శుక్రవారం దేవీ నవరాత్రుల సందర్భంగా జోగులాంబ అమ్మవారి దర్శనానికి రాజకీయ, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులందరికీ ఆలయ ఈఓ శ్రీమతి దీప్తి ఘన స్వాగతం పలికారు. అర్చకులచే పూర్ణకుంభంతో స్వాగతం పలికిస్తూ, వారి చేత అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేలా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి దంపతుల సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, రాష్ట్ర ప్రజల

సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయాలను దర్శించుకున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కే. శివసేనా రెడ్డి,వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీ సంపత్ కుమార్, సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖ నటులు కూడా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకున్నారు. వారందరికీ ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రముఖుల రాకతో ఆలయం కిటకిటలాడింది.

హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయండి

ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి-అర్బన్ రీజియన్ (PURE) వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్--2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ పవర్ పాలిటిక్స్‌లో పెద్ద చిచ్చు!

విశ్వసనీయ వర్గాల సమాచారం.

సీన్ 1: భట్టి పొగిడాడు – సీన్ 2: రేవంత్ తిట్టాడు! అసలేం జరిగింది?

ఈ మొత్తం వివాదానికి బీజం పడింది ఇలా...

రెండు రోజుల క్రితం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈ ఏడాది విపరీతమైన ఎండలు, తీవ్రమైన కరువు నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగింది. అయినా, ఎక్కడా పెద్దగా కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్ అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారంటూ వారిని భట్టి బహిరంగంగానే మెచ్చుకున్నారు. "మీ కృషి అభినందనీయం" అంటూ భట్టి పొగడ్తల వర్షం కురిపించారు. అధికారులు కూడా హ్యాపీగా బయటకు వచ్చారు. కానీ, ఆ ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మరుసటి రోజే సీఎం రేవంత్ రెడ్డి హఠాత్తుగా విద్యుత్ శాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు భట్టి విక్రమార్కను పిలవలేదు అనేది ఇక్కడే అసలు పాయింట్. సమీక్షలో రాష్ట్రంలో అక్కడక్కడా జరుగుతున్న విద్యుత్ కోతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అధికారుల నిర్లక్ష్యం వల్లే కోతలు వస్తున్నాయి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనితీరు దారుణంగా ఉంది" అంటూ నిందలు వేశారు. అంతటితో ఆగకుండా, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ పై ఏకంగా సస్పెన్షన్ వేటు వేశారు. అధికారుల పనితీరుపై విచారణకు ఒక ఉన్నతస్థాయి కమిటీని కూడా వేశారు. భట్టి పొగిడిన అధికారులపైనే రేవంత్ రెడ్డి వేటు వేయడం ఇప్పుడు సచివాలయంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

భట్టి శాఖపై రేవంత్ పెత్తనమా? తెరవెనుక అసలు కథ ఇదే!

ఈ వ్యవహారం వెనుక కేవలం అధికారుల పనితీరు మాత్రమే కాదు, పెద్ద రాజకీయమే ఉందని భట్టి వర్గం గట్టిగా చెబుతోంది. విద్యుత్ శాఖ పూర్తిగా భట్టి విక్రమార్క పరిధిలోని శాఖ.

ఆ శాఖకు సంబంధించిన ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, సమీక్ష చేయాలన్నా, సస్పెన్షన్ చేయాలన్నా డిప్యూటీ సీఎం ద్వారానే జరగాలి. అది ప్రొటోకాల్. కానీ, భట్టిని పూర్తిగా పక్కనపెట్టి రేవంత్ రెడ్డి నేరుగా సమీక్షలు నిర్వహించడం, తనను సంప్రదించకుండానే సీఈ ను సస్పెండ్ చేయడం భట్టి వర్గానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. "భట్టి పనితీరు బాగాలేదు, అందుకే సీఎం స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది" అన్న సంకేతాలు ప్రజల్లోకి, అధికారుల్లోకి వెళ్లేలా రేవంత్ వ్యవహరించారని భట్టి అనుచరులు మండిపడుతున్నారు. తన శాఖపై తనకు తెలియకుండానే పెత్తనం చెలాయించడాన్ని భట్టి విక్రమార్క జీర్ణించుకోలేకపోతున్నారని, విద్యుత్ కోతలపై అధికారులను బలి చేయడం సరికాదనే భావనలో ఆయన ఉన్నారని సమాచారం.

జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. విదేశాంగ మంత్రిని ఉద్దేశించి ఆయన పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అని సంబోధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలేం జరిగింది?

వచ్చే వారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ యూనిట్‌ను సందర్శించనున్నారు. అనంతరం ముంబైలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. ఈ భేటీలలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రూబియో తన సిబ్బందిని ముంబైకి రమ్మని ఆదేశించారు. మోదీ గారూ... విదేశాంగ మంత్రిత్వ శాఖలో మీ అధికారులు ఏం జరుగుతుందో తెలియక గందరగోళంలో ఉన్నారు. వారికి మీరైనా వివరించండి...! లేదా నన్ను చెప్పమంటారా...!" అని తన పోస్టులో పేర్కొన్నారు.

వివాదాస్పదమైన వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ తన పోస్టులో ఎక్కడా జైశంకర్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, "రూబియో తన సిబ్బందిని రమ్మన్నారు" అని అంటున్నారు. ఒకవేళ మట్టి, ఇసుక కుంగడం వల్ల ప్రమాదం జరిగితే పిల్లర్లు అలా పగుళ్లు రావని, స్తంభాలకు అలాంటి డ్యామేజ్ జరగదని చెబుతున్నారు. అప్పట్లోనే కొందరు ఇంజినీర్లు కూడా "అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్ర చేశారు" అంటూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రిపేర్లకు ఆసక్తి చూపని రేవంత్ సర్కార్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ బ్యారేజీ రిపేర్ల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దగా ఆసక్తి చూపించలేదనే విమర్శలు ఉన్నాయి. బ్యారేజీని మరమ్మతు చేసి వాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పుడు తాజాగా మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు స్వయంగా బాంబు శబ్దం వచ్చిందని చెప్పడంతో, మేడిగడ్డ పిల్లర్లను నిజంగానే పేల్చారా? అనే అనుమానం మరింత బలపడుతోంది. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మేడిగడ్డ దగ్గర బాంబు పేలిన శబ్దం

రావు ఈ విషయాన్ని బయటపెట్టారు. నాటి ఘటనను గుర్తు చేసుకుని, ఇకనైనా దానిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. "అక్టోబర్ 21, 2023న మేడిగడ్డ 7వ బ్లాక్ దగ్గర బాంబు పేలినట్లుగా పెద్ద చప్పుడు వచ్చింది. ఆ శబ్దం విని బాంబు పేలిందని అనుమానించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కూడా వచ్చి ప్రాథమిక విచారణ చేశారు" అని మురళీధర్ రావు స్పష్టంగా చెప్పారు. మురళీధర్ రావు వ్యాఖ్యలతో మేడిగడ్డ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు మొదటి నుంచి వ్యక్తం చేస్తున్న అనుమానాలకు బలం చేకూరినట్లైంది.

బాంబుతో పేల్చారా? బీఆర్ఎస్ ఆరోపణలకు బలం

మొదటి నుంచి బీఆర్ఎస్ నేతలు ఒకే మాట చెబుతున్నారు. రాజకీయ కుట్రతోనే మేడిగడ్డ పిల్లర్లను బాంబుతో పేల్చారని, ఇది ప్రమాదం కాదు కుట్ర అని ఆరోపిస్తున్నారు. నిపుణులు కూడా అదే

డిఫెండింగ్ చాంప్ రాయల్స్‌కు చోళ చీఫ్స్ షాక్

హైదరాబాద్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ 5-3తో డిఫెండింగ్ చాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్‌పై విజయం సాధించింది. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో అలెజాండ్రా ఉస్కియానో 80కి 79 పాయింట్లు సాధించగా, రజత్ చౌహాన్ చివరి బాణంతో కీలకమైన 9 పాయింట్లు సాధించాడు. తొలి సెట్‌లో టోక్యో ఒలింపిక్ చాంపియన్ మెతే గాజోజ్ ఆరు పాయింట్లకే పరిమితం కాగా, రెండో సెట్‌లో స్వాతి స్థానంలో బరిలోకి దిగిన ఎల్లా గిబ్సన్ రాణించింది. మూడో సెట్‌లో చీఫ్స్ కాంపౌండ్ ఆర్చర్లు 40కి 40 పాయింట్లు సాధించారు. ఆరు పాయింట్లతో ఉన్న చీఫ్స్ ప్లేఆఫ్స్‌కు దూరమవగా, ఎనిమిది పాయింట్లతో ఉన్న రాయల్స్ టైటిల్ రేసులో ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

యాదాద్రి థర్మల్ ప్లాంట్ లో సీక్రెట్ భేటీ – కమిటీకి సహకరించొద్దని అధికారుల నిర్ణయం!

మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విద్యుత్ అధికారులు కూడా భగ్గుమంటున్నారు. "సీఎంకు విద్యుత్ వ్యవస్థపై కనీస అవగాహన లేదు, ఎల్ నినో, కరువు పరిస్థితుల్లో విద్యుత్ డిమాండ్ ఎలా ఉంటుందో తెలియకుండా మమ్మల్ని నిందిస్తున్నారు" అని విద్యుత్ ఉద్యోగ సంఘాలు బహిరంగంగానే విమర్శిస్తున్నాయి. తాజాగా నిన్న జెన్‌కో ఎండీ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను సందర్శనకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఉన్న సీనియర్ అధికారులు, ఇంజనీర్లు అంతా ఒక చోట చేరి సీఎం వ్యాఖ్యలు, సస్పెన్షన్, కమిటీ అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. "మేము ఎండలో, వానలో కష్టపడి పని చేస్తుంటే మమ్మల్ని బలిపశువులను చేస్తున్నారు, మా కృషిని గుర్తించడం లేదు.

డిప్యూటీ సీఎం మెచ్చుకుంటే, సీఎం తిడుతున్నారు. మేము ఎవరి మాట వినాలి

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

సంపాదకీయం

గిగ్ వర్కలుగా మారుతున్న యూత్..

ప్రతి సంవత్సరం కొన్ని లక్షలు మంది డ్రిగీ పట్టాలతో బయటికొస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. కానీ ఇలా డిగ్రీ పట్టా చేతితో పట్టుకొని.. సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్కా.. ఎంతో మంది పార్ట్‌టైం జాబ్‌గా ఫుడ్ డెలివరీ జాబ్స్‌కు పరిమితమవుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. మరీ ఇది వారి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది. కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యువత బయటకు వస్తున్నారు. ఇలా బయటకొచ్చిన ఓ గ్రాడ్యుయేట్ ఓ సాధారణ రెజ్యూమెతో ఉద్యోగాల కోసం వెతుక్కుంటూ.. సరైన జాబ్ దొకకా తర్వాతి అడుగు ఎటు వేయాలో తెలియని అయోమయంలో పడిపోతుననారు. చివరికి అద్దె బైక్‌పై ఫుడ్ డెలివరీ చేస్తూ, రోజూవారీ ఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఎప్పటికైనా తాను చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. మన దేశంలో ఏటా లక్షలాది మంది యువతీ, యువకులు ఎదుర్కొంటున్న ఈ చదువు పూర్తి కావడానికి ? సరైన ఉపాధి దొరకడానికి మధ్య ఉండే ఖాళీ వ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరివర్తన కాలాన్ని అనుకోకుండా వదిలేయకుండా, ఒక పద్ధతి ప్రకారం డిజైన్ చేశారు. ముఖ్యంగా జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్‌షిప్ విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అక్కడ విద్యార్థులు సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం వాస్తవ పని ప్రదేశంలో గడుపుతూ వేతనం పొందుతారు. సుమారు 8.3 కోట్ల జనాభా ఉన్న జర్మనీలో దాదాపు 13 లక్షల మంది అప్రెంటిస్‌లుగా ఉన్నారు. అంటే వారి మొత్తం జనాభాలో వీరు 1.5 శాతానికి పైగా ఉంటారు.భారత్‌లోనూ దీనికి సమానంగా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ఉంది. కానీ ఇక్కడి గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో, 2024?25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద నమోదైన అప్రెంటిస్‌ల సంఖ్య కేవలం 9.85 లక్షలు మాత్రమే. అంటే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే జర్మనీ కంటే ఇది దాదాపు 20 రెట్లు తక్కువ.ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అవకాశాలు లేకపోవడం సమస్య కాదు. అధికారిక నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ పథకం కింద ఏకంగా 70 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. సమస్య ఖాళీల కొరత కాదు, యువత వీటి కోసం దరఖాస్తు చేయకపోవడమే. 2022లో 42.8 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, 2025 నాటికి ఏకంగా 4 లక్షలకు పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.చదువు నుంచి కెరీర్‌కు వారధిగా నిలవాల్సిన లక్షలాది పోస్టులను నిరుద్యోగ యువత ఎందుకు ఎంచుకోవడం లేదు? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దీని వెనుక బలమైన ఆర్థిక కారణాలు కనిపిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లలో సాధారణంగా నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు మాత్రమే స్టైపెండ్ ఇస్తారు. దీనికోసం వేరే నగరాలకు వెళ్లి అక్కడే ఉండాలి.. పైగా ట్రైనింగ్ తర్వాత ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. దీంతో చాలా మంది దీనివైపు మొగ్గుచూపట్లేదని నివేదికలు చెబుతున్నారు.అదే సమయంలో దీనికి భిన్నంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, రిటైల్ స్టోర్లలో పని వంటి గిగ్ ఉద్యోగాలు వెంటనే డబ్బును అందిస్తున్నాయి. సొంత ఊరిలోనే ఉంటూ పనిచేసుకునే వెసులుబాటు ఉండటం, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన యువత అప్రెంటిస్‌షిప్ కంటే గిగ్ పనులకే మొగ్గు చూపుతున్నారు.

గిగ్ వర్క్ తాత్కాలిక ఆదాయానికి, ఉపాధికి మంచి మార్గమమే అయినప్పటికీ.. ఇది భవిష్యత్తులో అధిక వేతనాలు, స్థిరమైన కెరీర్‌ను ఇచ్చే సర్టిఫైడ్ నైపుణ్యాలను అందించలేదు. అదే క్రమబద్ధమైన అప్రెంటిస్‌షిప్ అయితే తరగతి గది పాఠాలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానించే నైపుణ్యాన్ని ఇస్తుంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శిక్షణ ద్వారా కెరీర్‌ను నిర్మించుకోవడం కంటే, చేతికి వెంటనే డబ్బు తెచ్చిపెట్టే తాత్కాలిక పనుల వైపే భారతీయ యువత అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.యువత తీసుకుంటున్న ఈ నిర్ణయం వారి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరైనదే కావొచ్చు. కానీ లక్షలాది ఖాళీలు అందుబాటులో ఉన్నా, ఒక క్రమబద్ధమైన శిక్షణా విధానాన్ని యువత ఎందుకు కాదనుకోవాల్సి వస్తుందన్నదే అసలు ప్రశ్న. వ్యవస్థాగత విధానాలు, స్టైపెండ్ స్థాయిలు, భవిష్యత్ ఉద్యోగ భద్రత వంటి అంశాలలో మార్పులు రానంత వరకు ఈ అంతరం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది.

ఎల్‌నినో ఎఫెక్ట్.. జలగండం తప్పదా?

- కిన్నెరసాని జలాలపై ఆందోళన..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు!

- పచ్చదనం హరించుకుపోతే.. నీటి భద్రత ప్రశ్నార్థకమే!

- నీటి పొదుపే మంత్రం.. చెట్ల పెంపకమే ప్రకృతి రక్షణ!

కొత్తగూడెం బ్యూరో అక్టోబర్ 16(విజన్ ఆంధ్ర) : ప్రకృతి మనకు అందించిన అత్యంత విలువైన సంపద నీరు. జీవకోటికి ఆధారమైన ఈ జలవనరులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంపై నెలకొన్న ఆందోళనలు, వర్షపాతం హెచ్చుతగ్గులు, భూగర్భ జలాల అధిక వినియోగం నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో వేసవికాలంలో నీటి అవసరాలు పెరగడం, భూగర్భ జలాలపై ఆధారపడటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కిన్నెరసాని జలాశయంతో పాటు స్థానిక చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షపాతం ఎప్పుడు, ఎంత మేరకు కురుస్తుందనే విషయంలో అనిశ్చితి పెరుగుతోంది. ఎల్‌నినో పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో వర్షపాతంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం ప్రాంతాన్ని బట్టి మారుతుంది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, కురిసిన వర్షపు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, అందుబాటులో ఉన్న నీటిని విచ్చలవిడిగా వినియోగించడం వంటి అంశాలు కలిసివస్తే నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల నీటి కొరత ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే వారు సూచిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు.. భవిష్యత్తుపై ఆందోళన

భూగర్భ జలాలు మనిషి జీవనానికి, వ్యవసాయానికి, పారిశ్రామిక అవసరాలకు కీలకమైన వనరు. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లు, బావుల ద్వారా తాగునీరు, సాగునీరు పొందుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ అనేక నివాస ప్రాంతాలు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నాయి. అయితే అవసరానికి మించి నీటిని తోడుకోవడం, భూమిలోకి వర్షపు నీరు ఇంకేందుకు తగిన ఏర్పాట్లు లేకపోవడం, సహజ నీటి ప్రవాహ మార్గాలు దెబ్బతినడం వల్ల కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల పునరుద్ధరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

వర్షాకాలంలో కురిసిన నీటిని భూమిలోకి ఇంకేలా చేయకపోతే వేసవిలో నీటి అవసరాలను తీర్చుకోవడం కష్టమవుతుంది. బోర్లలో నీటిమట్టం తగ్గడం, నీటి కోసం మరింత లోతుకు తవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడటం ప్రజలకు ఆర్థిక భారాన్ని పెంచుతాయి. ముఖ్యంగా రైతులు సాగునీటి కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, నీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతం చేయడం అత్యవసరం.

కిన్నెరసాని జలవనరుల పరిరక్షణపై దృష్టి అవసరం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిన్నెరసాని జలవనరులు పర్యావరణపరంగా, స్థానిక అవసరాల పరంగా ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. జలాశయంలో నీటి లభ్యత, నీటి వినియోగం, వర్షపాతం, పరివాహక ప్రాంతంలో నీటి ప్రవాహాలు వంటి అంశాలు జలవనరుల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. వర్షాలు తగ్గిన సందర్భాల్లో జలాశయాల్లోకి వచ్చే నీటి పరిమాణం తగ్గే అవకాశం ఉండటంతో నీటి నిల్వలు, వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం తగ్గుతోందనే ఆందోళనల నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రస్తుత నిల్వలు, గత సంవత్సరాలతో పోలిక, నీటి విడుదల, జలాశయంలోకి చేరుతున్న నీటి పరిమాణం వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ఉపయోగకరంగా ఉంటుంది. వాస్తవ గణాంకాల ఆధారంగా పరిస్థితిని అంచనా వేసి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తే నీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుంది. జలాశయాల పరిరక్షణతో పాటు వాటి పరివాహక ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడం, నేల కోతను అరికట్టడం, నీటి ప్రవాహ మార్గాలను సంరక్షించడం కూడా ముఖ్యమే.

పచ్చని పాలాల స్థానంలో వెంచర్లు.. ప్రకృతికి దెబ్బ

పట్టణీకరణ, జనాభా పెరుగుదలతో నివాస స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ భూములు నివాస వెంచర్లుగా మారుతున్నాయి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, పర్యావరణ సమతుల్యతను పట్టించుకోకుండా భూములను వినియోగిస్తే దీర్ఘకాలిక సమస్యలు తలెత్తవచ్చు. పచ్చని పొలాలు, చెట్లు, సహజ నీటి ప్రవాహ మార్గాలు తగ్గిపోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు పరిమితం కావచ్చు. భూమిపై కాంక్రీటు నిర్మాణాలు, సిమెంట్ రహదారులు పెరిగినప్పుడు వర్షపు నీరు వేగంగా ప్రవహించి బయటకు వెళ్లిపోతుంది. తగిన డ్రైనేజీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు లేకపోతే ఒకవైపు వర్షపు నీరు వృథాగా వెళ్లిపోగా, మరోవైపు భూగర్భ జలాల పునరుద్ధరణకు అవసరమైన నీరు అందుబాటులో ఉండదు. అందుకే కొత్త వెంచర్లు, భవన నిర్మాణాల్లో వర్షపు నీటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేయడం, సహజ నీటి మార్గాలను ఆక్రమణలకు గురికాకుండా కాపాడటం అవసరం.

కనుమరుగవుతున్న చెట్లు.. పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

చెట్లు ప్రకృతికి జీవాధారం. గాలిని శుద్ధి చేయడం, కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం, నేల కోతను తగ్గించడం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. చెట్లతో కూడిన ప్రాంతాలు స్థానిక సూక్ష్మ వాతావరణాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. అయితే రహదారుల విస్తరణ, నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల పేరుతో చెట్లను తొలగించడం వల్ల పచ్చదనం తగ్గే ప్రమాదం ఉంది. చెట్లు తగ్గిపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా అనిపించే పరిస్థితులు ఏర్పడవచ్చు. చెట్ల వేర్లు నేల నిర్మాణాన్ని స్థిరంగా ఉంచడంలో, వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంలో తోడ్పడతాయి. అందువల్ల చెట్లను నరికివేయకుండా సంరక్షించడం, ఖాళీ ప్రదేశాల్లో స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను నాటడం, నాటిన మొక్కలు బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత.

నీటి పొదుపే మంత్రం.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

నీటి సంక్షోభాన్ని నివారించడానికి ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. ఇంటి నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు ప్రతి స్థాయిలో నీటి పొదుపు అలవాటుగా మారాలి. కుళాయిలను అవసరం లేనప్పుడు తెరిచి ఉంచకపోవడం, పైపుల లీకేజీలను వెంటనే మరమ్మతు చేయించడం, వాహనాలు కడగడం వంటి పనుల్లో అధిక నీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా గణనీయమైన నీటిని ఆదా చేయవచ్చు.ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయాలి. చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన పూడికను శాస్త్రీయంగా తొలగించడం, వాటి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి వృథాను అరికట్టేందుకు స్థానిక సంస్థలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

వ్యవసాయంలో నీటి పొదుపు పద్ధతులు అవసరం

వ్యవసాయ రంగంలో నీటి వినియోగం కీలకం. సాగునీటిని అవసరానికి మించి వినియోగించడం వల్ల నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. పంట అవసరాలకు అనుగుణంగా నీటిని అందించడం, సాధ్యమైన చోట బిందుసేద్యం, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరించడం వల్ల నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చు. నేలలో తేమను నిల్వ ఉంచే పద్ధతులు పాటించడం, పంటలకు అనుకూలమైన సాగు ప్రణాళికలను రూపొందించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. రైతులకు నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు సంబంధిత శాఖలు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలి. వర్షాధార ప్రాంతాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు, పొలాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టడం ద్వారా సాగునీటి అవసరాలను కొంతవరకు తగ్గించుకోవచ్చు.

ఇప్పటి నుంచే మేల్కొందాం.. భావితరాలకు జలభద్రత కల్పిద్దాం

నీటి కొరత ఏర్పడిన తర్వాత ప్రత్యామ్నాయాల కోసం పరుగులు పెట్టడం కంటే, అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించడం ఎంతో ముఖ్యం. నీటి వనరుల సంరక్షణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలి. పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. చెట్ల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి. ఎల్‌నినో ప్రభావం ఎంతవరకు ఉంటుందన్నది వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉన్నప్పటికీ, నీటి వృథాను తగ్గించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, పచ్చదనాన్ని సంరక్షించడం మన చేతుల్లోనే ఉన్నాయి. నేడు మనం తీసుకునే చిన్నచిన్న జాగ్రత్తలే రేపటి నీటి భద్రతకు పునాదిగా నిలుస్తాయి. నీటిని కాపాడితేనే జీవనానికి భరోసా.. చెట్లను పెంచితేనే పర్యావరణానికి రక్ష.. ప్రకృతిని సంరక్షిస్తేనే భావితరాలకు భవిష్యత్తు!

భారత్‌మాల రహదారిపై ట్రాక్టర్ ప్రమాద బాధితులకు కార్మిక సంక్షేమ ప్రయోజనాలు అందేలా చర్యలు

- నిబంధనలు ఉల్లంఘించే గుంపు మేస్త్రీలు,కాంట్రాక్టర్లపై చట్టప్రకారం చర్యలు

- జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వేణుగోపాల్

గట్టు అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ట్రాక్టర్ ప్రమాద ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు, గాయపడిన కార్మికులకు కార్మిక సంక్షేమ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వేణుగోపాల్ తెలిపారు. ట్రాక్టర్ ప్రమాద బాధితుల వివరాల సేకరణలో భాగంగా శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. ఈ ప్రమాదంలో నాగన్నయేసేపు అనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో 19 మంది గాయపడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతుల్లో నాగన్నకు భవన నిర్మాణ కార్మికుల లేబర్ కార్డు ఉండగా, యేసేపుకు లేబర్ కార్డు నమోదు కాలేదని తెలిపారు.గాయపడిన వారికి లేబర్ కార్డులు,ఈ-శ్రమ్ కార్డులు ఉన్నాయా అనే వివరాలను పరిశీలించి, వర్తించే నిబంధనల ప్రకారం ప్రమాద బీమా,ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించే అవకాశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి, గత 12 నెలల్లో కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసిన అర్హులైన కార్మికులు భవన నిర్మాణ కార్మికుల లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అసంఘటిత రంగ కార్మికులు https://eshram.gov.in ద్వారా ఉచితంగా ఈ-శ్రమ్ నమోదును చేసుకోవచ్చని తెలిపారు.కార్మికులు తమ నమోదు వివరాలను సక్రమంగా ఉంచుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు.ఇతర రాష్ట్రాలకు కార్మికులను పనుల నిమిత్తం తీసుకెళ్తున్న గుంపు మేస్త్రీలు,కార్మిక కాంట్రాక్టర్లు వర్తించే చట్టాలు,నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం, సురక్షితమైన పని వాతావరణం, అవసరమైన వైద్య,నివాస సదుపాయాలు కల్పించడం, చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు.కార్మికులను బలవంతంగా తరలించడం, వేతనాలు చెల్లించకపోవడం, భద్రతా నిబంధనలు ఉల్లంఘించడం వంటి ఫిర్యాదులపై విచారణ చేపట్టి,ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వెళ్లే కార్మికులు తమ వేతన ఒప్పందాలు, కాంట్రాక్టర్ వివరాలు, పని ప్రదేశం,నివాస సదుపాయాలు, బీమా,సంక్షేమ ప్రయోజనాలపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని సూచించారు.సమస్యలు ఎదురైతే సమీప కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కోరారు.

కులమతాలకు అతీతంగా మానవత్వమే మతం

నారాయణపేటలో 552వ ఉర్సు ఉత్సవాలు ప్రారంభం
అంతర్‌మత సదస్సులో వివిధ మతాల పెద్దలు, రాజకీయ ప్రముఖులు

నారాయణపేట, అక్టోబరు 16 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొల్లంపల్లిలో కొలువైన హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ ఖుతాల్ హుస్సేనీ అఖ్రఫీ జలాలీ దర్గా 552వ వార్షిక ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అఖ్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ అఖిల భారత అంతర్‌మత సదస్సుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గోగి షరీఫ్ దర్గా సజ్జాదా నషీన్ సయ్యద్ షా కలీముల్లా హుస్సేనీ అధ్యక్షతన, కొల్లంపల్లి దర్గా సజ్జాదా నషీన్ మఖ్దూం ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అఖ్రఫీ జలాలీ పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మౌలానా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వకార్ ఇన్సా, ముజఫర్ హుస్సేన్ ఖాన్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్. రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.ఏ. రషీద్, బీసీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఖలీల్, బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక గురువులు, సామాజిక, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని మతాల బోధనల సారాంశం మానవత్వం, ప్రేమ, శాంతి, సోదరభావమేనని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ సమానమేనని, కులమతాలకు అతీతంగా పరస్పర గౌరవంతో జీవించాలని సూచించారు. సూఫీ పీఠాలు ప్రేమ, ఐక్యత, మానవ సేవకు ప్రతీకలని, వాటి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి అంతర్‌మత సదస్సులు హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు అన్ని మతాల మధ్య సౌహార్దాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్య, వైద్యం, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం అఖ్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. దారుల్ ఉలూమ్ అఖ్రఫియా మదర్సా విద్యార్థులు ప్రదర్శించిన విద్యా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అతిథులను దర్గా సజ్జాదా నషీన్ మౌలానా మఖ్దూం ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అఖ్రఫీ జలాలీ, డాక్టర్ మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ అఖ్రఫీ జలాలీ సత్కరించారు. అడ్వకేట్ అబ్దుల్ సలీం కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సయ్యద్ ఫైజ్ పాషా కృతజ్ఞతలతో సదస్సు ముగిసింది.

మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారీ కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా లాజిటెక్ హరియాణాలోని మనేసర్‌లో స్థానిక తయారీ, అసెంబ్లీ కార్యకలాపాలను ప్రారంభించినట్లు లాజిటెక్ చీఫ్ సప్లై చైన్ ఆపరేషన్స్ ఆఫీసర్ చెనించెర్రీ, శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి దశలో వెబ్‌కామ్‌లు, పాయింటింగ్ డివైజ్‌లను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో సరఫరా వ్యవస్థ సామర్థ్యం పెరిగి, భారతీయ వినియోగదారుల అవసరాలకు వేగంగా స్పందించవచ్చని సంస్థ తెలిపారు. లాజిటెక్ పర్సనల్ వర్క్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ డెల్ఫిన్ డొన్నే, ఐఎంఈఏ ప్రాంతీయ డైరెక్టర్ పోలినా అనోఖినా, ఇండియా కంట్రీ హెడ్ మనోజ్ సహోయ్ ఈ విస్తరణలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

54 షేటర్లను కులిచ్చిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులది..

- కౌన్సిలర్ మాస్టర్ షేక్షావలి ఆచారి

అయిజ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్ మాస్టర్ షేక్షావలి ఆచారి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం బీఆర్ఎస్ నాయకులు చేసిన అరోపణలకు అయిజ కాంగ్రెస్ పార్టీ నాయకుల స్పందిస్తూ, ఈ మీడియా సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.గత10 సంవత్సరాల పాటు పాలనలో వున్న బీఆర్ఎస్ నాయకుల చేసిన అరాచకాలు చేస్తూ 54 షేటర్లను కులిచ్చిన చరిత్ర మీదని అన్నారు.మీ బాస్ జాతరకి వ్యాపారస్తుల నుంచి డబ్బుల వసూలు చేసిన రోజు వ్యాపారస్తులు బెదురుకోలేదా అని బీఆర్ఎస్ నాయకుల పై పైర్ అయ్యారు.అయిజ పట్టణలో ప్రజలకు కష్టం వచ్చినప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు. కరోన సమయం కాని సాగు రైతుల కోరకు ఒక కాలువై తెచ్చార. వ్యాపారస్తుల కోసం ఎప్పుడై రోడుపైన ధర్నా చేశారా అని విమర్శించారు. దయ్యాలు వేదాలు చెప్పినట్లు నిన్న బి ఆర్ స్ పార్టీ నాయకులు మాట్లాడినట్లు ఉన్నాయి. గతంలో 2023లో మీ ప్రభుత్వం ఉన్నప్పుడే అట్టి షెటర్లకు నోటీసులు అందజేశారు. అట్టి నోటీసులపై ఇప్పుడు మున్సిపల్ అధికారులు షేటర్లను సీజ్ చేశారు. ఈ విషయాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులపై బురద చల్లే మాటలు మాట్లాడడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పూలను దైవాలుగా కొలిచే పండగ బతుకమ్మ

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): బతుకమ్మ ప్రకృతి పండుగ ప్రకృతిలో దొరికే గునుగు, తంగేడు, తీరు రుద్రాక్షాలు, బంతి, చామంతి తీరొక్క పూలతో తీరు తీరు బతుకమ్మను పేర్చి అవే పువ్వులను నీటిలో వేసే ప్రకృతి పండుగ ఇది. పర్యావరణాన్ని కాపాడే పండుగ ఈ బతుకమ్మ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక అన్నారు. శుక్రవారం మేడ్

ఇంఛార్జ్ మంత్రి ని కలిసిన డి సి సి అధ్యక్షుడు నరేశ్ జాదవ్,మాజీ ఎంపీ రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర)ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో ఆదివాసుల ఆరాధ్య దైవం అయిన గుస్సాడి లకు మూడు కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చెయ్యడంతో జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ డీసీసీబి చెర్మన్ అడ్డి భోజ రెడ్డి గారితో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపెల్లి కృష్ణ రావు ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దండారిలకు పది వేల నుంచి 15 వేలకు పెంచడం జరిగిందని, రాబోయే రోజుల్లో దండారి షెడ్స్ కొరకు నిధులు మంజూరు చెయ్యాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.నిధులు మంజూరు చెయ్యడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్లే ఆత్రం సక్కు, మాజీ జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ లు చరణ్ గౌడ్,ఇజ్జగిరి సంజయ్, తదితరులు ఉన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

- మహిళా పోలీసులతో కలిసి ఆడిపాడిన ఎస్పీ సునీతారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి ఐపీఎస్ మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడిపాడారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గునుగు, తంగేడు తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, గౌరమ్మను ప్రతిష్ఠించారు. రంగవల్లుల నడుమ బతుకమ్మలను ఉంచి సంప్రదాయ పాటలు పాడుతూ మహిళా పోలీసులు సందడి చేశారు. కోలాటాలు ఆడుతూ, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీతారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ, బోనాలు, సమ్మక్క-సారలమ్మ జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తాయని తెలిపారు. వనపర్తి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. విధుల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తూ వృత్తిని ప్రేమించాలని గుర్తుచేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగలను జరుపుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) వీరారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడి రమేష్, రత్నం, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాసకుమార్‌తో పాటు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గమనిక: ప్రచురణకు పంపే ముందు అధికారుల పేర్లు, హోదాలు ఒకసారి సరిచూసుకోండి.

ఎన్ హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తెలంగాణ రక్షణ సేన పూర్తి మద్దతు

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర) ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తెలంగాణ రక్షణ సేన సంపూర్ణ మద్దతు పలుకుతుంది పార్టి రాష్ట్ర కార్మిక సంఘం టీ ఆర్ టి యు అధ్యక్షులు దేవళ్ల వీరన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నీ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న ధర్నా కార్యక్రమానికి హాజరైన టీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు కిషన్ నాయక్, బుక్యా సంజీవ్ నాయక్, అలాగ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కిర్మిల్లా వినోద్ చారి జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ అశోక్ మోహల్కర్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చౌహాన్ పుష్పలత తదితర జిల్లా నాయకులు సమ్మె చేస్తున్న ఉద్యోగులను కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా దేవళ్ల వీరన్న మాట్లాడుతూ, "రాష్ట్రంలో ఏ ఉద్యోగి కూడా సంతోషంగా లేడు. ఉద్యోగుల ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే కారణం" అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వీలైనంత త్వరగా పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, ఈ సమ్మె భవిష్యత్తులో రాజకీయ ఉద్యమంగా మారే అవకాశం ఉందని, దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రక్షణ సేన ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో టి ఆర్ ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత దృష్టికి తీసుకొని వెళ్లి ప్రభుత్వానికి లేఖ రాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఎన్ హెచ్ ఎం ఉద్యోగ సంఘాల జే ఏ సీ నాయకులు ణతీ. వనిత.

అలంపూరు పట్టణంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి వినతిపత్రం అందజేసిన అలంపూర్ డెవలప్మెంట్ కమిటీ

అలంపూర్ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : చారిత్రాత్మక ప్రాంతమైన అలంపూరు పట్టణంలో యువత శారీరక ఉల్లాసం, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఒక విశాలమైన క్రీడా మైదానాన్ని (స్పోర్ట్స్ గ్రౌండ్) ఏర్పాటు చేయాలని అలంపూర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పట్టణంలో సరైన క్రీడా ప్రాంగణం లేకపోవడంతో స్థానిక యువకులు, విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలంపూర్‌లో క్రీడా మైదానం అందుబాటులోకి వస్తే గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి రజిని బాబు, కమిటీ ప్రతినిధులు సంజీవ నాయుడు, ముస్తఫా, సూర్యప్రసాద్, వెంకటేష్, కరునేందర్, ఆనంద్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా ప్రతిభకు ఛాంపియన్స్ కప్

- 15 మండలాల క్రీడాకారులతో పోటీలు ప్రారంభం
- ప్రతిభావంతులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- క్రీడాస్ఫూర్తితో ఆడి ట్రోఫీలు సాధించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ఆటలతో ఆరోగ్యం.. మానసిక ఉల్లాసం
- ఎస్పీ డి.సునీతారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడానికి వనపర్తి ఛాంపియన్స్ కప్-2026 ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. విద్య, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని మండలాల క్రీడాకారులకు అవకాశం కల్పించాలన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి.సునీతారెడ్డితో కలిసి పోటీలను ప్రారంభించారు.

ఏడు క్రీడాంశాల్లో పోటీలు

జిల్లా చరిత్రలో తొలిసారిగా 15 మండలాల క్రీడాకారులతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్ క్రీడాంశాలను ఏర్పాటు చేశారు. తొలుత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన, క్రీడా పతాకావిష్కరణ అనంతరం పోటీలను ప్రారంభించారు.

తాడులాగుడులో పోటాపోటీ

ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధుల బృందం, జిల్లా అధికారుల బృందం టగ్ ఆఫ్ వార్‌లో తలపడ్డాయి. ఇరువర్గాలు ఒక్కోసారి విజయం సాధించాయి. అనంతరం కొత్తకోట, రేవల్లి మండలాల మధ్య క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, క్యారమ్స్, చెస్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్‌లో వనపర్తి-పానగల్, కబడ్డీలో పానగల్-చిన్నంబావి, ఫుట్‌బాల్‌లో అమరచింత-గోపాల్‌పేట జట్లు తలపడ్డాయి. చెస్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, శివసేనారెడ్డి ఎత్తుకు పైఎత్తులు వేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్యారమ్స్‌లో ఎస్పీ డి.సునీతారెడ్డి ఆటతీరు ఆకట్టుకుంది.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు

గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు ఛాంపియన్స్ కప్ వంటి పోటీలు దోహదపడతాయని శివసేనారెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీపడే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వనపర్తిలో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించి, సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసం కలుగుతుందని వివరించారు.

అత్యధిక ట్రోఫీలు సాధించిన మండలానికి ఛాంపియన్స్ కప్

దసరా పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ కలెక్టర్ ఆదర్శ్ సురభి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాస్ఫూర్తితో ఆడుతూ విజయాలు సాధించాలని సూచించారు. వివిధ క్రీడాంశాల్లో అత్యధిక ట్రోఫీలు సాధించిన మండలానికి ఛాంపియన్స్ ట్రోఫీ అందజేస్తామని వెల్లడించారు.

ఆటలతో ఆరోగ్యం.. మానసిక ఉల్లాసం

ఆటల్లో గెలుపోటములు సహజమని ఎస్పీ డి.సునీతారెడ్డి అన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, పరస్పర సహకారం, జట్టుగా పనిచేసే లక్షణాలు అలవడతాయని తెలిపారు. డిజిటల్ యుగంలో మైదానాల్లో ఆటలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం, ఆరోగ్యం, శారీరక దృఢత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నల్లబంగారు నేలపై కేసీఆర్ పాపం!!

- కార్మిక గర్జన కాదు.. రాజకీయ గర్జన
- సింగరేణిని సర్వనాశనం చేసింది కేసీఆర్ పాలనే
- రామగుండాన్ని బొందల గడ్డగా మార్చింది ఎవరు?
- కార్మికుల చెమటతో రాజకీయ డ్రామాలా.. కేటీఆర్?
- పదేళ్ల పాపాలు మరిచి.. ఇప్పుడు కార్మికులపై ప్రేమా?
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ధ్వజం

పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణిని పదేళ్ల పాలనలో నిలువునా దోచుకుని, రామగుండం గడ్డను బొందలగడ్డగా మార్చిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నిప్పులు చెరిగారు. శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

అది కార్మిక గర్జన కాదు... బీఆర్ఎస్ కార్యకర్తల గర్జన!

ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన సభపై మక్కాన్ సింగ్ ఘాటుగా స్పందించారు. "అది కార్మికుల కష్టాల నుంచి పుట్టిన గర్జన కాదు... అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కార్యకర్తల అక్కసు గర్జన మాత్రమే. పదేళ్లపాటు అధికారంలో ఉండి సింగరేణిని సర్వనాశనం చేసి, ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కిన కేసీఆర్ కుటుంబం... నేడు ఏ ముఖం పెట్టుకుని కార్మికుల ముందు నిలబడుతోంది? మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల పేరిట కార్మికులపై కపట ప్రేమ నటిస్తూ కేటీఆర్ ముసలి కన్నీరు కారుస్తున్నారు. గత పాలకుల హయాంలో డిపెండెంట్ ఉద్యోగాలు, మెడికల్ అన్‌ఫిట్ బోర్డుల పేరుతో ఒక్కొక్కరి నుంచి ?15 లక్షల దాకా లంచాలు మింగి, వీధుల్లో బట్టలు చించుకుని కొట్టుకున్నది గులాబీ నాయకులు కాదా?" అని నిలదీశారు.

సింగరేణి సంపద దోచి.. సిరిసిల్ల, సిద్దిపేటకు మళ్లించారు!

భూగర్భంలో కార్మికులు చెమటోడ్చి, రక్తం ధారపోసి తెచ్చిన సంపదను పాలకుల సొంత నియోజకవర్గాలకు తరలించారని ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు:

సీఎస్సార్ నిధుల దోపిడీ

రామగుండం కార్మికుల కష్టార్జితమైన సింగరేణి సీఎస్సార్ నిధులను నిస్సిగ్గుగా సిరిసిల్ల, సిద్దిపేటల అభివృద్ధికి మళ్లించుకున్నారు. యాదాద్రి కుట్రలి రామగుండంలో పుష్కలంగా బొగ్గు, గోదావరి జలాలు, వేల ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నా కాదని, ఎలాంటి వనరులూ లేని చోట యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎందుకు ఏర్పాటు చేశారో సమాధానం చెప్పాలి.

ప్రైవేటీకరణ కుట్ర

నాడు కేంద్రంలోని బీజేపీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని సింగరేణిని ప్రైవేటీకరించేందుకు బీఆర్ఎస్ పత్తాసు పలికింది. ఇప్పుడు తప్పులు కప్పిపుచ్చుకునేందుకు బొగ్గు మాయమైందంటూ కేటీఆర్, హరీష్‌రావులు గల్లీ నాటకాలు ఆడుతున్నారు. కార్మికులకు కేటీఆర్ తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

కార్మికుడి కన్నీరు తుడిచిన ఇందిరమ్మ రాజ్యం!

బీఆర్ఎస్ హయాంలో అన్యాయానికి గురైన సింగరేణి కార్మికులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలిచిందని మక్కాన్ సింగ్ స్పష్టం చేశారు:

భరోసా కల్పించే ఎక్స్‌గ్రేషియా

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రికార్డు స్థాయిలో 1 కోటికి పెంచిన ఘనత కాంగ్రెస్‌దే. కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలకూ సమాన విలువనిస్తూ 40 లక్షల పరిహారాన్ని అందిస్తున్నాం.

సొంతింటి కల సాకారం

ఏళ్ల తరబడి వేచిచూస్తున్న కార్మికుల సొంతింటి కలను నిజం చేసింది ఈ ప్రభుత్వమే.

వికేంద్రీకృత వైద్యం

మెడికల్ బోర్డుల కోసం కార్మికులు పడే ఇబ్బందులను తొలగించేందుకు రానున్న రోజుల్లో సింగరేణిలోని అన్ని ప్రధాన ఏరియాల్లో మెడికల్ బోర్డులను ఏర్పాటు చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. బొగ్గు గని లోతుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి వెలుగులు పంచే శ్రామికుడి వెన్నెముక సింగరేణి. ఆ గడ్డపై స్వార్థ రాజకీయాలు చేస్తే సహించేది లేదు. చేసిన పాపాలకు బీఆర్ఎస్ నేతలు కార్మిక లోకానికి క్షమాపణ చెప్పాల్సిందే అని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి
- ఈ నెల 22 నుంచి నవంబర్ 4 వరకు ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమం (ఎల్‌డిసి)

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర): జాతీయ కుష్ఠ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పై పునశ్చరణ శిక్షణా కార్యక్రమాన్ని ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, వరంగల్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ, 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ప్రజలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాల గుర్తింపునకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఇంటిలోని ప్రతి వ్యక్తిని పరిశీలించి, కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజలు తమ శరీరంపై స్పర్శ జ్ఞానం లేని రాగి లేదా గోధుమ రంగు మచ్చలు కనిపించినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే తమ ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలు లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని, లేదా సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్ల నరాల దెబ్బతినడం, అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కుష్ఠు వ్యాధిపై అపోహలు వీడి, వ్యాధి లక్షణాలు ఉన్నవారు ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పునశ్చరణ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ/డీఐఓ డాక్టర్ ఐ. ప్రకాష్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, లెప్రసీ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, డిప్యూటీ పారామెడికల్ అధికారి వెంకన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ కానుకగా నాలుగో తరగతి ఉద్యోగులకు పండుగ కానుకలు అందజేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16(విజన్ ఆంధ్ర) : బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తన సొంత నిధులతో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులను ఆత్మీయ కుటుంబ సభ్యులుగా భావిస్తూ పండుగ కానుకలు అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగులకు చీరల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉద్యోగులతో ఆత్మీయంగా మమేకమై బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల పట్ల తనకున్న ఆప్యాయతను చాటుతూ, పండుగ వేళ తన సొంత నిధులతో కానుకలు అందజేయడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణ రాజు, నాలుగో తరగతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వీరేష్ మృతికి ఎస్ఐ నందికర్ కారణం..

- హత్య కేసు నమోదు చేయాలి..
- పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్...

గద్వాల అక్టోబర్ 16(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ వీరేష్ మృతికి కారణమైన ధరూర్ ఎస్ఐ నందికర్‌పై హత్య కేసు నమోదు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాఖతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.పొలం వద్ద జరిగిన వివాదంలో వీరేష్‌పై ధరూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని, ఈ క్రమంలో ఎస్ఐ నందికర్ విచారణ పేరుతో తనను తీవ్రంగా కొట్టారని వీరేష్ ఆరోపించినట్లు సంఘం నాయకులు తెలిపారు. మనస్తాపానికి గురైన వీరేష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు.నా చావుకు ధరూర్ ఎస్ఐ నందికర్ కారణం అంటూ వీరేష్ మాట్లాడిన వీడియోను మరణ వాంగ్మూలంగా పరిగణించి, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి ఎస్ఐ నందికర్‌పై హత్య కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ చేసిన వారిలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.డి. సుభాన్, ఉపాధ్యక్షుడు మహాదేవ్,తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర ప్రభాకర్,తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్,ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమీచేడు కార్తీక్, పీవైఎల్ అధ్యక్షుడు బీరెలి దానయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ బాషా, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేవతి తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల ఆధునికీకరణ అభినందనీయం

- బసంతి ఫౌండేషన్ సేవలను కొనియాడిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని మూడు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్న బసంతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం తాండ, పెద్దగూడెం గ్రామాల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునికీకరిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకుడు అజయ్‌తో కలిసి ఆయన సందర్శించారు. చిన్నారులకు మెరుగైన వసతులు ప్రస్తుతం ఉన్న అంగన్వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టి, చిన్నారులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు అజయ్ కలెక్టర్‌కు వివరించారు. ఇందులో భాగంగా కొత్త కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ టైల్స్, ఆధునిక వంటగది, ఫ్రిజ్, టీవీ, ఆట వస్తువులు, కిచెన్ గార్డెన్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు గ్రామాలతోపాటు మంగంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా ఆధునికీకరించనున్నట్లు వెల్లడించారు. హాజరు శాతం పెంచాలి అంగన్వాడీ కేంద్రాలను అన్ని హంగులతో ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అంగన్వాడీ టీచర్, గ్రామ సర్పంచ్ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రపురి కాలనీ 2 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బూడిద వెంకటేష్ నియామకం

జవహర్ నగర్, విజన్ ఆంధ్ర; అక్టోబర్ 16,: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ 2 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బూడిద వెంకటేష్ నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించి నశీదుకు పార్టీ బలోపే తానికి మరింత కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి, అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఇంచార్జి తోట కూర వజ్రేష్ యాదవ్ కి, జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ కి, 2 వ డివిజన్ చంద్రపురి కాలనీ అధ్య క్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ కి, మాజీ ప్రజా ప్రతి నిధులకు,స్థానిక నాయకులకం ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా చర్యలు

- ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

- ఆసుపత్రుల్లో పటిష్ట అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ ఉండాలి

- విజిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్న నమ్మకం కలిగేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలతో పాటు ప్రతిరోజూ నమోదయ్యే ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్దిష్ట సమయానికి విధులకు హాజరై రోగులకు నిరంతరాయంగా సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించిన కలెక్టర్, అన్ని వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు. డయాలసిస్ కేంద్రం, నవజాత శిశువుల విభాగం, రక్త పరీక్షల గది, మందుల గదితో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలను సకాలంలో నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వైద్య సేవలు, మందులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పటిష్టమైన అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాలను పరిశీలించి, వాటి పనితీరు, గడువు తేదీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో 24 గంటలూ సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల కొనుగోలులో పారదర్శకత పాటించాలి

- రైతులకు మద్దతు ధర అందించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); పంటల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు పంటలు విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. శుక్రవారం భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంటల కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం తూకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పంటలు విక్రయించేందుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడి, కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శశిభూషణ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విబిజి రామ్ జీ పథకం ద్వారా అర్హులందరూ ఉపాధి పొందాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); విబిజి రామ్ జీ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసా పట్టణంలోని సురలోక గార్డెన్స్ ఫంక్షన్ హాలులో, జోన్ 4, 5 లకు సంబంధించి విబిజి రామ్ జీ పథకం అమలుపై గ్రామీణ స్థాయి సూక్ష్మ ప్రణాళికపై కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్ నినో వల్ల వ్యవసాయం తీవ్ర ప్రభావానికి లోనైందని అన్నారు. పంటల దిగుబడి తగ్గిపోయిందని, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు, నీటి సంరక్షణ పద్ధతులను బలోపేతం చేసేందుకు విబిజి రామ్ జీ పథకం ఒక చక్కని అవకాశం అని వివరించారు. జాబ్ కార్డు కలిగిఉన్న ప్రతి ఒక్కరు 125 రోజుల పని దినాలు పొందాలని సూచించారు. దీని ద్వారా పేదలకు ఆర్థిక స్వాంతన చేకూరుతుందని చెప్పారు. విబిజి రామ్ జీ కార్యక్రమం కింద పెద్ద ఎత్తున నీటి సంరక్షణ పనులను చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు, లోటు వర్షపాతం కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయాయని, జలాశయాల్లో కూడా నీటి లభ్యత తక్కువగా ఉందని, నీటి సంరక్షణ చర్యలు పాటించడం ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడడం తోపాటు భవిష్యత్తు అవసరాలకు నీటి వనరులను కాపాడినట్లవుతుందని తెలిపారు.

విబిజి రామ్ జీ ద్వారా ఉపాధి పొందేలా ప్రజల్ని అధికారులు ప్రోత్సహించాలి:ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్.

విబిజి రామ్ జీ పథకం ద్వారా అర్హులైన ప్రజలందరూ ఉపాధి పొందేలా ప్రజలను అధికారులు ప్రోత్సహించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఎల్ నినో ప్రభావం చేత ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని, విబిజి రామ్ జీ పథకం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పిస్తే వారికి ఊరట లభిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు విబిజి రామ్ జీ పథకం గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయానికి సంబంధించి పనులను కూడా చేసుకునేందుకు వీలు ఉంటుందని వివరించారు. నీటి సంరక్షణ పనులను చేపట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి డిపిఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ తుకారాం, తహసిల్దార్ శశిభూషణ్, ఎంపిడివో పుష్పలత, ఇతర అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, విబిజి రామ్ జీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఏరియాలో కంపెనీ స్థాయి లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ల ముగింపు వేడుకలు

భూపాలపల్లి టౌన్ : 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన కంపెనీ స్థాయి లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ల ముగింపు వేడుకలు నేడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో సింగరేణి సంస్థకు చెందిన వివిధ ఏరియాల క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు.

లాన్ టెన్నిస్ విజేతల వివరాలు:

మెన్ సింగిల్స్ విభాగంలో ఆర్జీ-2 ఏరియాకు చెందిన సంజీవ్ ప్రథమ బహుమతి సాధించగా, మందమర్రి ఏరియా జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి విజేతలను అభినందించారు. క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కంపెనీ స్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, శ్రీమతి సాయికృష్ణ ూ ఏఐటియుసి నాయకులు మోటపలుకుల రమేశ్, ఐ.ఎన్.టి.యూ.సి ఎన్ముల బి.మధుకర్ రెడ్డి, భూపాలపల్లి సిఎంఓఏఏ ప్రతినిధి అరుణ్, స్పోర్ట్స్ సూపర్‌వైసర్ శ్రీ పర్స శ్రీనివాస్, స్పోర్ట్స్ కొఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, స్పోర్ట్స్ రెఫరీలు, తదితరులు పాల్గొన్నారు.

తక్షణ రుణం పేరుతో మోసపూరిత లోన్ యాప్‌లను నమ్మి సైబర్ మోసాలకు గురికావద్దు: జిల్లా ఎస్పీ నితికా పంత్,

ఒక్క తొందరపాటు చెల్లింపు మీకే కాదు.. మీ కుటుంబంపై కూడా ప్రభావం చూపవచ్చు" అని జిల్లా ఎస్పీ హెచ్చరిక

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్16:(విజన్ ఆంధ్ర) : తక్షణ రుణం లోన్ యాప్స్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, సూచించారు. ఈ మేరకు "తక్షణ రుణం లోన్ యాప్స్ పేరుతో సైబర్ మోసాలకు గురికావద్దు" అనే అవగాహన పోస్టర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో తక్షణ రుణాలు ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. అత్యవసర ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని నకిలీ లోన్ ఆఫర్లతో ప్రజలను ఆకర్షించి, రుణం మంజూరు చేయడానికి ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ చార్జీలు, ఇతర రుసుముల పేరుతో డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. లోన్ ఆఫర్ వచ్చినప్పుడు ప్రజలు ముఖ్యంగా ఈ మూడు విషయాలను గుర్తుంచుకోవాలని ఎస్పీ సూచించారు:

ఆగండి (PAUSE):

రుణం ఇప్పిస్తామని చెప్పి ముందుగానే డబ్బులు చెల్లించాలని కోరితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లించవద్దు.

ఆలోచించండి (THINK):

చాలా త్వరగా రుణం మంజూరు చేస్తామని లేదా ఎలాంటి పత్రాలు లేకుండానే సులభంగా లోన్ ఇస్తామని చెప్పే ఆఫర్లను నమ్మే ముందు అవి నిజమైనవా, నకిలీవా అని ఆలోచించాలి. ముందుగానే డబ్బులు ఎందుకు అడుగుతున్నారో పరిశీలించాలి.

ధృవీకరించండి (VERIFY):

రుణం అందిస్తున్న సంస్థకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్, సంప్రదింపు వివరాలు, సంస్థ విశ్వసనీయత వంటి అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలి. నకిలీ లోన్ ఆఫర్లను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ూపీ/డెబిట్ కార్డు వివరాలు, ూ్ా, ్రxచీ, పాస్‌వర్డ్‌లు వంటి సున్నితమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని ఎస్పీ సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి.. అడుగు వేయండి.

ఈ కార్యక్రమంలో , ఎఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, , ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, డి.ఫోర్.సి ఆర్ఎస్ఐ కిరణ్,ఎస్ఐ దివ్యతో పాటు డి.ఫోర్.సి బృందం సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు

అయిజ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు ఆధ్వర్యంలో శుక్రవారం అయిజ మండలంలోని బింగిదొడ్డి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి బాలబాలికకు విద్యను పొందే హక్కు ఉందని, పిల్లలను పనుల్లో పెట్టకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తాయని వివరించారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిర్వహణ, ప్రోత్సాహం, అరికట్టడంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎక్కడైనా బాల కార్మికులు లేదా బాల్య వివాహాల గురించి తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా, అర్హులైన మహిళలు, పిల్లలు మరియు ఇతర అర్హతగల వ్యక్తులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా, న్యాయవాది సేవలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ) టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేయవచ్చని సూచించారు. అలాగే, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులు లేదా ఇతర బాలల రక్షణ సమస్యలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి (డిడబ్ల్యూఓ) సునంద మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు, బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ మరియు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి (డిసిపిఓ) నరసింహ, బాలల సంక్షేమ కమిటీ (సిడబ్ల్యూసి) కౌన్సిలర్ జయన్న, గ్రామ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రాధా గోపాల్, ఉప సర్పంచ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హాచ్ ఏ ల్ రాఘవేంద్ర కాలని లో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో శ్రీ సరస్వతీ దేవి అలంకరణ : విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ,

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ నాయకి స్కూల్ యాజమాన్యం నాయకి శ్రీనివాస్ రావు, విద్యార్థినీ విద్యార్థులకు నోట్‌బుక్, పెన్, పెన్సిల్ సెట్, రబ్బరు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు గారు, ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్, శివ, శంకర్, పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థి విద్యార్థినులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న పంగ శ్రీహరి

కీసర, అక్టోబర్ 16, విజన్ ఆంధ్ర : శివానందపురి ? కాలనీ లోని దుర్గామాత టెంపుల్ ను చర్లపల్లి జైలు సూపర్ ఇండెంట్ ప్రమోద్, డీఎస్పీ శ్రీనునాయక్, నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ పంగ శ్రీహరి, వైస్ చైర్మన్ కిష్టన్న గారి రవి, సెక్రటరీ సిహెచ్ ఆనందరావు శుక్రవారం దర్శించుకున్నారు. గుడి చైర్మన్ సుప్రీత్ రెడ్డి, సినీ నటుడు కట్ రాజ్ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి. వెంకట మాధవ రావు బాధ్యతల స్వీకరణ.

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి. వెంకట మాధవ రావు శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముంది కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించినందున పలువురు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జనగణన సిబ్బందికి కలెక్టరేట్లో శిక్షణ కార్యక్రమం

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో భారత జనాభా గణన – 2027 కు సంబంధించి మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల్లోని చార్జ్ క్లర్క్ లు, టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం రెండవ దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంబంధిత జనగణన సిబ్బందికి వివిధ అంశాల్లో క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చారు. జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండి, ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి గంగారెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్ తెలంగాణ డి.వి. రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ తడులతో సాగయ్యే పంటలు మాత్రమే పండించేలా రైతులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16,(విజన్ ఆంధ్ర); ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ తడులతో సులభంగా సాగయ్యే పంటలను మాత్రమే వేసేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అధికారులతో వ్యవసాయ సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు సహకారం అందించాలన్నారు. నీటి లభ్యత కారణంగా ఎక్కడైనా పంటలు నష్టపోయినట్లయితే వివరాలను పారదర్శకంగా సేకరించాలని పేర్కొన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏవైనా సాంకేతిక పరమైన సమస్యలు కలిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జనగణన--2027 రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జనగణన – 2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు మార్గదర్శకాలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జనాభా లెక్కల ఫేస్-II ప్రక్రియపై చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమైన ప్రక్రియని పేర్కొన్నారు.జనగణన – 2027 రెండో దశలో భాగంగా జనవరి--ఫిబ్రవరి 2027లో చేపట్టనున్న నేపథ్యంలో చార్జ్ క్లర్కులు,సాంకేతిక సహాయకులకు రెండు రోజులు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.చార్జ్ క్లర్కులు,సాంకేతిక సహాయకులు జనగణన విధుల్లో కీలక పాత్ర పోషిస్తారని,ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.చార్జ్ క్లర్కులు తమ పరిధిలో జనగణన పనుల ప్రణాళిక,పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.సాంకేతిక సహాయకలు డిజిటల్ విధానాల్లో సమాచార నమోదు,పర్యవేక్షణ వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోర్టల్‌లో వివరాలను నమోదు చేసే సమయంలో ఖచ్చితత్వం పాటించాలని,సమాచార లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు లేదా సందేహాలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారుల మార్గదర్శకత్వం తీసుకోవాలని తెలిపారు.ఈ శిక్షణ ద్వారా పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టి, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ సుల్తాన్ అలీ,స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ హరిత,ఛార్జ్ క్లర్క్‌లు,టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్లిప్ డిస్క్ సమస్యకు అందరికీ ఆపరేషన్ అవసరం లేదు

- ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు

- ఫిజియోథెరపీ, వ్యాయామాలు, జీవనశైలిలో మార్పులతో ఉపశమనం

హైదరాబాద్, అక్టోబర్ 16:ఐ స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందంటే తప్పనిసరిగా ఆపరేషన్ చేయించుకోవాలనే అపోహ చాలామందిలో ఉందని, వాస్తవానికి ఎక్కువమందికి శస్త్రచికిత్స అవసరం లేకుండానే చికిత్స అందించవచ్చని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవం (వరల్డ్ స్పైన్ డే) సందర్భంగా స్లిప్ డిస్క్ సమస్య, దాని లక్షణాలు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, సరైన భంగిమలో కూర్చోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో వెన్నునొప్పి సమస్యలు తలెత్తవచ్చు. అయితే కొందరిలో వెన్నెముకలోని డిస్క్ బయటకు ఉబ్బి సమీపంలోని నరాలపై ఒత్తిడి కలిగించడం వల్ల కూడా నొప్పి వస్తుంది. దీనినే స్లిప్ డిస్క్‌గా పిలుస్తారు. వెన్ను లేదా మెడనొప్పి, చేతులు, కాళ్లకు నొప్పి వ్యాపించడం, తిమ్మిర్లు, స్పర్శ తగ్గడం, కండరాల బలహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఎక్కువసేపు కూర్చున్నప్పుడు, ముందుకు వంగినప్పుడు, బరువులు ఎత్తినప్పుడు నొప్పి పెరిగే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ న్యూరోసర్జన్, స్పైన్ సర్జన్ డాక్టర్ వై. మురళీకృష్ణలి మాట్లాడుతూ.. " బిస్లిప్ డిస్క్ వచ్చిందంటే ఆపరేషన్ తప్పదని చాలామంది భయపడుతుంటారు. కానీ ఎక్కువమంది రోగులు ఫిజియోథెరపీ, సరైన వ్యాయామాలు, అవసరమైన మందులు, జీవనశైలిలో మార్పులతో కోలుకుంటారు. నరాల బలహీనత తీవ్రంగా ఉన్నప్పుడు లేదా క్రమంగా పెరుగుతున్నప్పుడు, అత్యవసర లక్షణాలు కనిపించినప్పుడు, తగిన చికిత్స తీసుకున్నా తీవ్రమైన నొప్పి తగ్గనప్పుడు మాత్రమే శస్త్రచికిత్సను పరిశీలిస్తాం. ప్రతి రోగికి సమస్య తీవ్రతను బట్టి చికిత్స నిర్ణయించాలి " అని తెలిపారు.వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎక్కువసేపు ఒకేచోట కూర్చోకుండా మధ్యమధ్యలో విరామం తీసుకోవాలని, సరైన భంగిమలో కూర్చోవాలని వైద్యులు సూచించారు. నొప్పి తీవ్రతను బట్టి శారీరక శ్రమ కొనసాగించాలని, వైద్యుల సూచనల మేరకు వ్యాయామాలు చేయాలని తెలిపారు. బరువులు ఎత్తేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, సొంతంగా మందులు వాడటం, నిర్ధారణ కాని చికిత్సలను ఆశ్రయించడం మంచిది కాదన్నారు. మూత్రవిసర్జన లేదా మలవిసర్జనపై అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోవడం, గజ్జల చుట్టూ స్పర్శ తగ్గడం, కాళ్లలో బలహీనత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్యసేవలు పొందాలని సూచించారు. ఇవి నరాలపై తీవ్రమైన ఒత్తిడికి సంకేతాలు కావచ్చని, సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా సమస్య మరింత తీవ్రం కాకుండా చూసుకోవచ్చని వివరించారు.

ఆకట్టుకుని, అలరించిన "వెంపటి నాట్య మేదోన్మేళనం" నాట్య వైభవం

హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : కూచిపూడి నాట్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన నాట్యాచార్యుడు, ప్రఖ్యాత నాట్య గురువు, కీర్తిశేషులు డాక్టర్. పద్మభూషణ్ వెంపటి చిన్న సత్యాన్ని స్మరించుకుంటూ, కూచిపూడి నాట్య సాంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో వారి రూపకల్పనలో సృష్టించిన, రూపొందించినటువంటి నృత్య సాంప్రదాయ విలువలను కాపాడాలి అని, వారి శిష్యులు ఆ కూచిపూడి నృత్య రూపకాలను తరాలకు అందించాలని అతిథులు అభిప్రాయపడ్డారు. గురువారం సాయంత్రం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్టీఆర్ కళామందిరం, నాంపల్లి హైదరాబాద్ లో డాక్టర్ వెంపటి చిన్న సత్యం శిష్యులచే గురువు పైన ఉన్న భక్తితో నిర్వహించిన "వెంపటి నాట్య మేదోన్మేళనం" కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కన్నుల పండుగ జరిగింది. డాక్టర్. పద్మభూషణ్ వెంపటి చిన్న సత్యం పుట్టినరోజు సందర్భంగా "వెంపటి నాట్య మేదోన్మేళనం" పేరిట శిష్యులు నిర్వహించిన ఈ నృత్య వైభవం కార్యక్రమం ప్రేక్షకులను, నాట్య ప్రియులను ఆకట్టుకుంటూ కనువిందు చేసింది .ఈ వెంపటి నాట్య మేదోన్మేళనంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రిటైర్డ్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, పసుమర్తి ఉదయ్ భాస్కర్, పాల్గొని వెంపటి చిన్నసత్యం శిష్య బృందం వారి శిష్యులు వెంపటి చినసత్యం ముఖ్య ఆదర్శభావాలను, రూపొందించిన నృత్య రూపకాలను ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. ప్రత్యేక అతిథులుగా వెంపటి వారి కుమార్తెలు కామేశ్వరి, చావలి బాలా త్రిపుర సుందరి, డాక్టర్ జె తడకమళ్ళ అనురాధ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ డాన్స్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, నాట్యాచార్యులడు పసుమర్తి రామలింగ శాస్త్రి, సుధాకర్, రత్న శ్రీ, సుమిత్ర పార్థసారథి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంపటి చిన్న సత్యం శిష్యులు వారి శిష్య బృందంతో వెంపటి నాట్య సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వివిధ సాంప్రదాయ నృత్యాంశాలను నేత్రపర్వంగా ప్రదర్శించి అందరి ప్రశంశలను అందుకున్నారు. ముఖ్యంగా వెంపటి చిన్న సత్యం కుమార్తెలు కామేశ్వరి, చావలి బాలా త్రిపుర సుందరి శిష్యులు నేత్రపర్వంగా నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. గురుభక్తిని చాటుకుంటూ శిష్య బృందం సత్యవతి, మాదభూషిని రమిణి సిద్ధి, బి సంధ్యారాజు, డి శ్రీనివాస్, దుర్గేష్ నందిని, కామేశ్వరి, లక్ష్మీ ప్రసూన, మురారి రామ్మోహన్ అలాగే చింత శివాదినారాయణ శిష్య బృందం కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని నయనానందకరంగా ప్రదర్శించారు. అనంతరం నాట్య గురువులను, శిష్య బృందానికి ముఖ్య అతిథి పసుమర్తి ఉదయ్ భాస్కర్ ఈ సందర్భంగా ప్రశంశించి, అభినందించి సత్కరించారు. శిష్య బృందం అందరూ తమ గురువు డాక్టర్ వెంపటి చిన్నసత్యాని స్మరించుకుంటూ కూచిపూడి నాట్య సాంప్రదాయం తరతరాలుగా వారి రూపకల్పనలో రూపొందించినటువంటి నృత్య సాంప్రదాయ విలువలను కాపాడాలి అని బాధ్యతగా, ఈ "వెంపటి నాట్య మేదోన్మేళనం" కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి వాకిటి శ్రీహరి

అలంపూర్ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో) : శుక్రవారం దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పశుసంవర్ధక,క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు విఘ్నేశ్వర స్వామికి అభిషేకం చేశారు.అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,పట్టు వస్త్రాలు సమర్పించారు.అర్చకులు అమ్మవారి ప్రసాదం,శేషవస్త్రాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్ల దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో పుణ్యప్రదమైన అవకాశమని పేర్కొన్నారు.పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మవారు మరింత శక్తి,సామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావాలు తగ్గి,రాష్ట్రంలో అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీ జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.రైతాంగం మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రకృతి ప్రతికూల ప్రభావాల నుంచి ఉపశమనం పొందాలని అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు.రాష్ట్రం సస్యశ్యామలంగా మారి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత,ఆలయ ఈవో దీప్తి,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తినాలంటేనే జంకుతున్న భోజన ప్రియులు

- ఆహార భద్రత పై ఏది గ్యారంటీ..?

- జిల్లాలో కొరబడిన ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మెదక్, అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర ప్రతినిధి) ఆహార కల్తీని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నమ మాత్రం తనిఖీ లు నిర్వహిస్తూ చేతులు దులువుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల మున్సిపల్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోని మెదక్ ప్రధాన రహదారిపై గల వన్ ప్యాలెస్ రెస్టారెంట్ లో కల్తీ ఆహారం తిని సుమారు 20 మంది అస్వస్థతకు గురై చికిత్స పొందుతుండగా, అందులో నుంచి బుధవారం నాడు సాయిరామ్ అనే యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మరువకముందే నర్సాపూర్ బస్ స్టాండు ఎదుట గల సిటీ ప్యాలెస్ లో సమోసాలు తింటున్న హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఉద్యోగి కి గుట్కా లకు చెందిన అవశేషాలు వచ్చి వాంతులు చేసుకోవడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం నాడు ఫుడ్ పాయిజాన్ బారినపడ్డ 9వ వార్డుకు చెందిన మదన్ అనే వ్యక్తి డీఛార్జీ అయి ఆర్టీసీ బస్ స్టాండు ఎదుట గల ఓ హోటల్ లో ఇడ్లీ కొనుకోలు చేసి తినడానికి ఉపక్రమించగా అందులో పురుగు వచ్చింది. ఇలా హోటళ్ళ పరిస్థితి తయారైంది. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిపై ఏనాడూ ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. జిల్లాలో గల మెదక్, నర్సాపూర్, తుప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల తోపాటు మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీలున్నాయి. వాటిల్లో వందలాది హోటళ్లు నడుస్తున్నాయి. వాటిపై ఎలాంటి నియంత్రణ లేక ఇష్టరాజ్యాంగ ప్రజల ప్రాణాలతో చెలగాటమం ఆడుతున్నారనే ఆరోపణలున్నాయి.జిల్లా వ్యాప్తంగా ఒక్కరే అధికారి : జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారి ఒక్కరే ఉన్నారు. అయన మేడ్చల్ జిల్లా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.దాంతో హోటళ్ల పై తనిఖీ లు నామమాత్రంగా జరుగురున్నాయి. తనిఖీ లు లేకపోవడం తో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ లు సరైన నాణ్యత లేకుండానే ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తున్నారనే విమర్శలున్నాయి.ఆహారాన్ని ఇష్టంగా బయట తినే సంస్కృతి రోజు రోజుకు పెరిగిపోతుండటం వల్ల హోటల్ నిర్వాహకులు ఇష్టరాజ్యాంగ వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తినే ఆహారం ఎంత నాణ్యమైందనే విషయం గ్రహించని భోజన ప్రియులు అనారోగ్యం పలావురుతున్నారు. హోటళు , దాబా నిర్వాహకులు రంగుల కోసం రసయనాలు విపరీతంగా వాడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి జిల్లాలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, దాబా లపై దాడులు చేయాలనీ కోరుతున్నారు

కొత్త చెరువు వద్ద ఘనంగా బతుకమ్మ సంబరాలు

అల్వాల్, అక్టోబర్ 16, (విజన్ ఆంధ్ర): అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్త చెరువు బేబీ పాండ్ వద్ద శుక్రవారం వెంకటాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. బీఆర్ ఎస్ మహిళల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ పండుగ కొత్త శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మర్రి మమతా రెడ్డి, మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తల్లి ఆశీస్సు లతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లి విరియాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లను భావి మతరాల వారికి తెలియజేయడం కోసమే ఈ కార్యక్రమ నిర్వహణ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సబితా అనిల్ కిషోర్ సునీత రామ్ యాదవ్, శిరీష జితేందర్ రెడ్డి, నాయకురాలు వీణ, రేణుక, మాధవి, నాయ కులు డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, చరణ్ గిరి తదితరులు పాల్గొన్నారు

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ అక్టోబర్ 16 విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో నవంబర్ 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల భద్రతకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఘాట్ రోడ్డు పనులు కొనసాగుతున్నందున కొండపైకి వాహనాలను అనుమతించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. జాతర ప్రాంతంలో దొంగతనాలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లపై ప్యాచ్‌వర్కులు, మరమ్మతులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. అవసరమైన నిధుల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జాతర రోజుల్లో, ముఖ్యంగా నవంబర్ 16 న ఉద్దాల ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని మార్గాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని, వాహనాల పార్కింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలని, తగిన సంఖ్యలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్ షాపులు, మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు, కల్యాణ మండపం తదితర వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. లిజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ, గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, రవాణా, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతర ప్రాంగణంలో వివిధ శాఖల సమన్వయం కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తులకు అవసరమైన సమాచారం అందేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నిరంతర తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, షవర్ల ఏర్పాటు చేపట్టాలని, అవసరమైతే ముఖ్యమైన రోజుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని, పోలీసు శాఖ బందోబస్తు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ శాఖ బారికేడింగ్, రహదారుల మరమ్మతులు చేపట్టాలని, ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులు, మద్యం విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయ చైర్మన్ బత్తుల బాలరాజు, ఆర్డీవో నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మదన్ రెడ్డి, జిల్లా అధికారులు, చిన్నచింతకుంట మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న మాజీ మంత్రి

కీసర, అక్టోబర్ 16, విజన్ ఆంధ్ర : శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని ఎమ్మెల్సీ మాజీ మంత్రి బసవరాజ్ సారయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మాజీ మంత్రికి ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి, పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి పుష్పార్చన అనంతరం కల్యాణ మండపంలో స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి చిత్రపటంతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో ముప్పు శ్రీనివాస్ రెడ్డి

కీసర, అక్టోబర్ 16, విజన్ ఆంధ్ర : నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి లో కొలువుదీరిన శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి జి. నిష్కా పాత్రుడు

మల్దకల్ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఆది శిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం గద్వాల డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆహ్వానించారు. అ

దాస్నాపూర్ దసరా రావణ దహనం ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, స్థానిక కౌన్సిలర్ చరణ్ గౌడ్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ లోనిమావల మండలం దస్నాపూర్ రావణ దహనం మైదానాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ గ మున్సిపల్ కమిషనర్,,వార్డ్ కౌన్సిలర్ చరణ్ గౌడ్, లతో కలిసి పరిశీలించారు. విజయదశమి సందర్భంగా నిర్వహించే రావణ దహనం కార్యక్రమానికి వచ్చే ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ గారు మాట్లాడుతూ.. రావణ దహనం మైదానాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ వంటి యంత్రాల సహాయంతో శుభ్రపరిచే పనులు చేపడతామని తెలిపారు. అలాగే మైదానంలో ప్రజలకు అవసరమైన లైటింగ్, స్టేజ్ ఏర్పాటు, పారిశుద్ధ్య పనులు తదితర సౌకర్యాలను మున్సిపాలిటీ తరఫున కల్పిస్తామని స్పష్టం చేశారు. పండుగకు వచ్చే ప్రజలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రావణ దహనం కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, మహిళలకు, భక్తులందరికీ విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కొడంగల్ లో నిరంతర విద్యుత్ వికారాబాదులో కోతలు

- విద్యుత్ కోతతో యాసంగి పంటలు ఎండు ముఖం
- ట్రిప్పింగ్ లోవోల్టేజ్ సమస్య తీవ్రం
- రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రా కొడంగల్ కు ముఖ్యమంత్రా
- విద్యుత్ కోతతో తాగు సాగు నీటి కష్టాలు
- మీడియా సమావేశంలో మాట్లాడిన బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కుమ్మరపల్లి గోపాల్ ముదిరాజ్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : కరెంట్ గోసతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ పటేల్ బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కుమ్మరపల్లి గోపాల్ ముదిరాజ్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక కొడంగల్ కు మాత్రమే ముఖ్యమంత్రా అని మీడియా ముఖంగా ప్రశ్నించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల ఎన్నేపల్లిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ లో నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుంది కానీ వికారాబాద్ ప్రాంతంలో మాత్రం కోతలకు అడ్డు అదుపు లేకుండా ఉంటుందని భజమెత్తారు. ట్రిప్పింగ్ లోవోల్టేజ్ సమస్యలతో బోరు మోటర్లు కాలిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కుటుంబ సభ్యులందరూ రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడితే గాని నాలుగు నోటిలోకి వెళ్ళవని వారు స్పష్టం చేశారు. అప్పులు తెచ్చి పంటలు వేసుకుంటే రైతుల కళ్ళముందే వేసిన పంటలు ఎండిపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు కోతలతో సాగునీటితో పాటు తాగునీటి కూడా కష్టాలు వస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మనిషికి ఒక పూట కూడు లేకపోయినా గుక్కెడు నీళ్లు అత్యంత ఆవశ్యకమని వారు గుర్తు చేశారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ పడగళ్ల అశోక్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ గయాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, ఆలంపల్లి దాసు, రాయికల్ మల్లేశం నరసింహ గాండ్ల మల్లికార్జున్ సుభాన్ రెడ్డి తదితర బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ సందర్శించిన పేట తపస్ బృందం

నారాయణపేట ,అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో తపస్ బృందం శుక్రవారం ఢిల్లీలో భారత రాష్ట్రపతి భవనాన్ని, పార్లమెంట్ భవనం సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా రాష్ట్రపతి భవనంలోని సమావేశ మందిరం, ప్రధానమంత్రి, మంత్రిమండలి ప్రమాణ స్వీకారం చేసే మండపం

విదేశీ అధ్యక్షులు దేశానికి వచ్చినప్పుడు జరిగే ఒప్పంద గది

సందర్శించి వాటి ప్రాముఖ్యతను విశ్లేషకుల ద్వారా వివరంగా తెలుసుకోవడం జరిగింది. భవనం యందు లోక్ సభ,రాజ్యసభ సమావేశ మందిరాలను ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అద్భుతమైన నిర్మాణశైలి,ఒక్కొక్క నిర్మాణ ప్రాముఖ్యతను తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు తపస్ బృందం ధన్యవాదాలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో తపస్సు రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్రాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ రవీందర్ నర్సప్ప గోవింద్ రెడ్డి లక్ష్మారెడ్డి శ్రీనివాస్ రవికుమార్ కుర్మయ్య నర్సింగప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా దుస్తువుల పంపిణీ చేసిన సర్పంచ్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్16:(విజన్ ఆంధ్ర) : రాజంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు, చెప్పులు, సబ్బులు మరియు నూనె పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డివిజనల్ పంచాయతీ అధికారి (ఇన్ఛార్జి) ఒమర్ హుస్సేన్ పాల్గొని, పారిశుధ్య కార్మికులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పండుగ వేళ పారిశుధ్య కార్మికులను ప్రోత్సహిస్తూ, వారి సేవలను గుర్తించి అవసరమైన వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు నిరంతరం అందిస్తున్న సేవలను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి , వార్డు సభ్యులు బుర్స నిర్మల , బొట్టుపల్లి లావణ్య , గులాం జావేద్ , జాబిరి కిషోర్ గారు, బుర్స భూపతి , పంచాయతీ కార్యదర్శి జె. సాయికృష్ణ , జూనియర్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.

ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల ఆధ్వర్యంలో వంటా వార్పు

- 4వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు

నారాయణపేట, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఏం జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటితో నారాయణపేట జిల్లాలో నాల్గవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఏం ఉద్యోగులు వంటా వార్పు చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎన్. హెచ్.ఏం నిరసనలకు పలు సంఘాల మద్దతు...

ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల రిలే దీక్షలకు జిల్లా డిఎంఎచ్ఓ కార్యాలయము తరపున డాక్టర్ సాయిరాం, డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఉద్యోగ సంఘం తరపున డాక్టర్ బాలాజీ, సత్యనారాయణ, పిఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, టిఎన్జీఓ ఛైర్మెన్ నర్సింహ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ భాను, విజయ కుమార్, యూటీఎఫ్ అధ్యక్షులు బాలాజీ, భీమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి బలరాంలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు

శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య ఎనిచేయిస్తూ వస్తోందన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు అందుకు తగిన వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, , విరోజ, చందన,శ్వేతశ్రీ, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిఏఏం మమత తదితరులు పాల్గొన్నారు.

శిశు వయోవృద్ధుల తొమ్మిదవ జాతీయ పోషణ మాసం వేడుకలు.

- చిన్నారుల బాల్యం అంగన్వాడీ కేంద్రాల్లో బలోపేతం అవుతుందని, ప్రతి చిన్నారికి
- పోషకాహారం అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలని శాసన సభ్యులు గంద్ర సత్యనారాయణ రావు తెలిపారు.

భూపాలపల్లి జిల్లా 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) : మహిళా శిశు వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, స్థానికంగా సహజంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాల వినియోగంపై ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అంగన్వాడీ, గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు కార్యక్రమంలో వివరించారు. అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు విద్యాబోధనతో పాటు ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. జిల్లాలో సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి, అవసరమైన చోట స్థలాలు కేటాయించి, ప్రభుత్వ నిధులతో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోరారు. అనంతరం పోషణ ఛాంపియన్ ప్రశంషా పాత్రలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ అధికారులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ, వి.ఓ., అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని, అంగన్వాడీ కేంద్రాలలో మూత్రశాలలు లేని వాటిని గుర్తించి, వెంటనే మంజూరు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా అంగన్వాడి కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలలో ఆర్.ఓ. ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులలో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటి పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. అటవీ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్న ప్రాంతాలలో అభివృద్ధి పనులకు ఆటంకాలు కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని, అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, గ్రామ సర్పంచ్‌తో పాటు సంబంధిత గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, నిబంధనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ స్థలాల ఎంపికకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అటవీ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక సంస్థల అధికారులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం" విజయవంతం

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర), కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉ సైన్స్ వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) కు చెందిన స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ ఏ సి) ఆధ్వర్యంలోని స్వామి వివేకానంద జన్మదిన వేడుకల (ఎస్‌వీబీసీ) క్లబ్, వివేకానంద కేంద్ర కన్యాకుమారి (వి కె కె) సహకారంతో "రీల్ మేకింగ్‌లో పాల్గొన్నవారి కోసం వర్క్‌షాప్ మరియు దాని ముగింపు కార్యక్రమం" నిర్వహించిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని సివిల్ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి, జీవన్వ్రతి, వి.కె. కన్యాకుమారికి చెందిన శ్రీనివాస్ గండికోట, గౌరవ అతిథి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మంథని కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్ డా. జి. శ్రీధర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమం ని కిట్స్‌డబ్ల్యు పూర్వ విద్యార్థులైన కె. చంద్రశేఖర్ రెడ్డి, జి. వెంకట్ రెడ్డి, కె. రామ్ రెడ్డి, ఎ.కె.ఎస్.ఎస్.వి. రమణ మరియు ఐ. గణేష్ సాయి స్పాన్సర్ చేశారు అని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, వి కె కె జీవనవ్రతి శ్రీనివాస్ గండికోట మాట్లాడుతూ, సాంకేతిక విద్యతో పాటు జీవన విధానం కూడా ఎంతో ముఖ్యమని విద్యార్థులకు వివరించి వారిని ఉత్తేజపరిచారు. స్వామి వివేకానంద అందించిన జీవిత పాఠాలు నేటికీ యువత వికాసంలో అంతర్భాగంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కోసం యోగాసనాలు, శారీరక దృఢత్వానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు మరియు యువత తమ వ్యక్తిత్వ నిర్మాణంలోనూ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం లోనూ చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు.గౌరవ అతిథి గా విచ్చేసిన యువ విజేత, తెలంగాణ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ డాక్టర్ జి. శ్రీధర్ మాట్లాడుతూ, విద్యార్థి సమాజ ప్రయోజనం కోసం సరైన సవాళ్లను ఎదుర్కోవడానికి ఏకాగ్రత, నైపుణ్యం, సృజనాత్మకత, ఆచరణాత్మక జ్ఞానం అవసరమని నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో వి కె కె ప్రధాన కార్యకర్త వీక్షిత్, డీన్ (స్టూడెంట్ అఫైర్స్) ప్రొఫెసర్ కె. శ్రీధర్, హెడ్ (పి ఎస్. డి.) డాక్టర్ హెచ్. రమేష్ బాబు, ఎస్‌వీబీసీ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్ మరియు కోఆర్డినేటర్లు డాక్టర్ కె. రాజేంద్ర ప్రసాద్ మరియు కె. గౌతమ్ రాజు, విద్యార్థి కోఆర్డినేటర్లు ఆర్. సాయి సంజన రెడ్డి (అధ్యక్షురాలు), సిహెచ్. చైతన్య సాయి (డాక్యుమెంటేషన్ ఉ ప్రెజెంటేషన్), వి. హన్సిక (యాంకర్), కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పి.ఆర్.ఓ. డాక్టర్ డి. ప్రభాక రా చారి, టి.పి.ఓ. డాక్టర్ సిహెచ్. సతీష్ చంద్ర, అలాగే ఇతర డీన్లు మరియు విభాగ అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అందమైన కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను ఫోటోగ్రఫీ అండ్ మీడియా క్లబ్ వారు చిత్రీకరించారు.



సామల శ్రీనివాస్ రెడ్డికి ఆహ్వానం

కీసర, అక్టోబర్ 16, విజన్ ఆంధ్ర : టీం రావణ దహనం మూడు సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా రావణ ప్రతిమ దహన కార్యక్రమంలో పాల్గొనాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామల శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం టీం రావణ దహనం సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సామల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పొందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. యువత చిన్నప్పటి నుంచి భక్తి భావనలో పెరిగితే సమాజానికి ఉపయోగకరంగా ఉంటారని సామల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.



నిమ్స్ ఆసుపత్రిలో గాజర్ల అశోక్ ను పరామర్శించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూప?లపల్లిజిల్లా 15 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నిమ్స్ వైద్యులతో మాట్లాడి సరైన వైద్యం అందించాలని కోరారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో చెల్పూర్ గ్రూజూ చైర్మన్ గంద్ర సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎన్నేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన స్పీకర్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా వికారాబాద్ పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ తోట్ల ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు, పూజారులు, స్థానిక నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ... లిఅమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, రాష్ట్రం ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ వెంట వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్జ సుధాకర్ రెడ్డి, వికారాబాద్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంపై షీ టీం అవగాహన సదస్సు

భూపాలపల్లి టౌన్: 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్ఐ స్వప్న కుమారి, సభ్యులు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు షేర్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళల భద్రతకు షీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా షీ టీం నంబర్ 8712658162 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.

తప్పిపోయిన రెండేళ్ల బాలికను గంటల వ్యవధిలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన భూపాలపల్లి పోలీసులు

భూపాలపల్లి టౌన్ : 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో లక్ష్మీ నగర్ లో నివాసం ఉండే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస కూలీగా వచ్చిన ఒక వ్యక్తి తన రెండేళ్ల కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఇట్టి ఫిర్యాదు పై స్పందించి భూపాలపల్లి పట్టణ సిఐ సిహెచ్ శ్రీనివాస్ , ఎస్ఐ శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది మెట్టు శ్రీనివాస్, రాంబాబు కానిస్టేబుల్ లు తక్షణ చర్యలు చేపట్టి బాలికను శాంతి నగర్ లో గుర్తించి, క్షేమంగా ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ చిన్నారిని సురక్షితంగా తిరిగి అప్పగించిన పోలీసులకు బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమయంలో భూపాలపల్లి పట్టణ సిఐ సిహెచ్ శ్

డంపింగ్ యార్డ్ ఉన్నా.. ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు!

ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయా? అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆవేదన

దహేగం, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగం మండలంలోని బోర్లకుంట గ్రామంలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం లక్షల రూపాయల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ స్థలంలో డంపింగ్ యార్డ్‌ను నిర్మించింది. గ్రామంలో తడి, పొడి చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా డంపింగ్ యార్డ్‌కు తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఈ నిర్మాణం చేపట్టారు. అయితే, ప్రస్తుతం బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ, బోర్లకుంట గ్రామాల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయకుండా ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో డంపింగ్ యార్డ్ నిర్మించినప్పటికీ దానిని సక్రమంగా వినియోగించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు చెత్తను ఖాళీ ప్రదేశాల్లో వేయడాన్ని ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యమా, లేక అధికారుల పర్యవేక్షణ లోపమా అన్నది అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తను పశువులు, ముఖ్యంగా ఆవులు తినే ప్రమాదం ఉందని, దీంతో వాటి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా, గాలికి చెత్త ఎగిరి చుట్టుపక్కల ప్రాంతాలకు చేరడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన డంపింగ్ యార్డ్‌ను వినియోగించకపోతే దాని నిర్మాణం వల్ల ప్రయోజనం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి బోర్లకుంట, రాళ్లగూడ గ్రామాల నుంచి సేకరించే చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిజాంపేట్‌లో సిమెంట్ బెంచీల ఏర్పాటు

- ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, భారతీయ జనతా పార్టీ చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిజాంపేట్‌లో 120 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ జి. పద్మ ప్రసాద్ ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలతో కూడిన లారీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ సేవా స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. సిమెంట్ బెంచీల ఏర్పాటు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు గుర్తు అని అన్నారు. జి. పద్మ ప్రసాద్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన చోట సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు కూర్చునేందుకు సౌకర్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్లూరి యాదగిరి, శ్రీనివాస్, ఆకుల రాము, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లడమే లక్ష్యంగా.. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిజాంపేట్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, హిందుస్థాన్ సమితి సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ నగర్‌లో పాత కక్షలతో వ్యక్తిగత ఘర్షణ.. కేసు నమోదు, పోలీసుల అదుపులోలి నిందితులు

- ఘటనకు మతపరమైన రంగు వద్దు.. అసత్య ప్రచారాలను నమ్మవద్దు

- మొదట స్వామి దాడికి పాల్పడడం జరిగింది, సీసీటీవీలో నమోదైన ఘటన,

వ్యక్తిపై దాడి లో ఇద్దరు హిందువులు, ఒక ముస్లిం మతాలకు చెందిన వ్యక్తులు.

- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవు

- జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది -- డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌లో గత రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిగత ఘర్షణ చోటుచేసుకుందని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. ఒక స్వామి మాల్ ఉన్న వ్యక్తి మరొక వ్యక్తితో దురుసుగా మాట్లాడటంతో ప్రారంభమైన గొడవ, అనంతరం దాడికి దారితీసిందని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయని వెల్లడించారు. ఈ ఘటనలో మొదట స్వామి దాడికి పాల్పడడం జరిగిందని, స్వామి పై దాడి ఘటనలో ఇద్దరు హిందువులు ఒక ముస్లిం మతాలకు చెందిన వ్యక్తులు ఉన్నారని, స్వామి మాలలో ఉన్న వ్యక్తిపై ఇరు మతాలకు చెందిన వ్యక్తులు ఉన్నప్పటికీ, ఇది పాత కక్షలతో జరిగిన వ్యక్తిగత ఘర్షణ, కాలనీ వాసుల మధ్య మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఘటనపై స్వామి ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో హిందువులు, ముస్లింలపై కేసు నమోదు చేసి, గొడవకు కారణమైన నిందితులను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనను ఆసరాగా చేసుకొని సోషల్ మీడియా, వాట్సాప్‌లలో వాస్తవాలు తెలుసుకోకుండా ఒక వర్గానికి మద్దతుగా ప్రచారాలు చేయడం, ఇతరులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం, మతసామరస్యానికి భంగం కలిగించే ప్రయత్నాలు చేయడం, శాంతి భద్రతల సమస్యలు తలెత్తేల ప్రవర్తించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించినా, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య ప్రచారాలు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించుకోకుండా ఎలాంటి ప్రచారాలు చేయవద్దని, ఆదిలాబాద్ జిల్లాలో మతసామరస్యాన్ని కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఆల్ టైమ్ రికార్డు

- తొలిసారిగా 20,000 మెగావాట్లు దాటింది,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో సరికొత్త రిక నమోదైంది. అక్టోబర్ 15, 2026 ఉదయం 10:29 గంటలకు రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధికంగా 20,003 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) నమోదైన 18,548 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇది ఏకంగా 1,455 మెగావాట్లు ఎక్కువ కావడం గమనార్హం. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం విద్యుత్ వినియోగం 334.54 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. అక్టోబర్ 1 నుండి 15 వరకు సగటు దినసరి గరిష్ట డిమాండ్ 19,289 మెగావాట్లుగా, సగటు విద్యుత్ వినియోగం 321.34 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (TGSPDCL) పరిధిలో రికార్డులు:

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో అక్టోబర్ 15న గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,281 మెగావాట్లకు చేరగా, దినసరి విద్యుత్ వినియోగం 228.14 మిలియన్ యూనిట్లకు తాకింది. ఇది గతేడాది గరిష్ట దినసరి వినియోగం (222.34 ఎం యు) తో పోలిస్తే 5.80 మిలియన్ యూనిట్లు ఎక్కువ. ఇక రాజధాని హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ జి హెచ్ ఎం సి, పరిధిలో అక్టోబర్ 15న సాయంత్రం 6:19 గంటలకు గరిష్ట డిమాండ్ 4,220 మెగావాట్లకు చేరుకుంది. గతేడాది అక్టోబర్‌లో నమోదైన 3,552 మెగావాట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. నగరంలో గృహ, వాణిజ్య, ఐటీ మరియు పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడం, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా కూలింగ్ పరికరాల వాడకం విపరీతంగా పెరగడమే ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు తెలిపారు.

విద్యుత్, నీటి పొదుపునకు పిలుపు:

పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా గ్రిడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భూగర్భ జలాలు పడిపోవడం వల్ల బోర్వెల్స్, వ్యవసాయ పంపుసెట్లపై ఆధారపడటం పెరిగిందని, ఇది గ్రిడ్‌పై అదనపు భారాన్ని మోపుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వినియోగదారులు విద్యుత్‌ను విచక్షణతో వాడాలని, అలాగే నీటిని పొదుపు చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల కోసం 'పొలం బాట' కార్యక్రమం:

వ్యవసాయ రంగానికి విద్యుత్ అత్యంత కీలకం కావడం గమనించిన



పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గత వారంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారుల బృందాలు 'పొలం బాట' పేరుతో ఉదయం పూట గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. భూగర్భ జల మట్టాలు, మోటార్ల పనితీరు, పంటల ఆరోగ్యాన్ని నేరుగా పరిశీలిస్తూ.. లో-వోల్టేజ్, లైన్ ఫాల్ట్స్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరిస్తున్నాయి. సాగుకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తున్న ఈ రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇంజనీర్లు, ఫీల్డ్ సిబ్బందిని ఎండీ జితేష్ వి. పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను.

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులపై ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం, అత్యవసర వైద్య సేవల మెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో మున్సిపల్ పరిధిలోని రహదారులపై విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణను పటిష్టం చేయడంతో పాటు, నో-పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించాలన్నారు. బస్టాండ్‌లు, బస్‌స్టాప్‌లు లేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా లోని మెడికల్ కాలేజీ ప్రవేశ మార్గాల్లో చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని, అంబులెన్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో నో-హార్న్ జోన్‌లు, నో-స్కోకింగ్ జోన్‌లు తదితర భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖలకు సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్య సహాయం అందేలా అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్సా సదుపాయాలను సమీక్షించాలని సూచించారు. పీఎం రాహాట్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై సంబంధిత అధికారులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ప్రమాద బాధితులకు అందించే చికిత్స, అంబులెన్స్ సేవల లభ్యతపై సంబంధిత వైద్యాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రోడ్లు మరియు భవనాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాగా సమావేశ ప్రారంభంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ, ఆర్టీవో, పోలీసు, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపించారు. ఆయా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణ కు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ మల్లికార్జున్,ఆర్టీవో మున్నీ, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్టీసీ డిపో మేనేజర్ యాకన్న, ఆర్ అండ్ బీ ఏ.ఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

- నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలి

- ప్రత్యామ్నాయ పంటలు, నీటి పొదుపుపై రైతులకు అవగాహన కల్పించాలి

- వేసవిలో తాగునీరు, పశువుల నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి:జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ (బ్యూరో అక్టోబర్ 16 విజన్ ఆంధ్ర)రానున్న యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులను ముందుగానే అంచనా వేసి, వాటికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించడం ద్వారా కరువు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, సాగు విస్తీర్ణం, వివిధ పంటలకు అవసరమయ్యే నీటి పరిమాణంపై సమగ్ర అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, ఫామ్ పాండ్లు, బోర్లు, బావుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా ఏ ప్రాంతంలో ఏ పంటలు సాగు చేయాలి, అందుబాటులో ఉన్న నీటితో ఎన్ని రోజులు, ఎన్ని తడులు అందించగలమనే అంశాలపై స్పష్టమైన సాగు ప్రణాళిక రూపొందించాలన్నారు. అధిక నీటి వినియోగం కలిగిన పంటల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రైతులను క్షేత్రస్థాయిలో కలిసి నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో రైతుల బోర్లు, బావులు, ఇతర నీటి వసతి సౌకర్యాల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ ఏఈవోలను ఆదేశించారు. నీటిపారుదల, భూగర్భ జలాలు, వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళికా శాఖలు సమన్వయంతో నీటి వనరుల వివరాలను క్రోడీకరించి, భవిష్యత్‌లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అవసరమైన ప్రభుత్వ సహకారంతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని తెలిపారు. చెరువులు, కుంటలు, ఫామ్ పాండ్లలో అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని, నీటి వనరుల సంరక్షణతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, పూడికతీత, నీటి సంరక్షణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు అధికంగా పనిదినాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా వి.బి.-జి. రామ్‌జీ కింద సుమారు 5,000కు పైగా ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా, పశువులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెల ఏర్పాటుకు అవసరమైన చర్యలను పశుసంవర్ధక, డీఆర్‌డీవో అధికారులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. వి.బి.-జి. రామ్‌జీ కింద ఈ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించడంతో పాటు విద్యుత్ వృథాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మల్టీ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులు తదితర సంస్థల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు, భూగర్భ జలాల సంరక్షణ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రైతు వేదికల ద్వారా రైతులకు సమగ్ర అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతులకు ముందస్తుగా సరైన సమాచారం, సూచనలు అందించడం ద్వారా పంట నష్టాలను తగ్గించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, సిపిఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సందీప్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ సుభాష్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గా దేవి మరియు శారద మాత నవరాత్రి నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలి

- దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.

- జిల్లాలో ఆసాంఘిక కార్యకలాపాలు గేమింగ్,

ఓపెన్ డ్రింకింగ్ పూర్తిగా అరికట్టాలి.

- దసరా నవరాత్రులలో మైనర్ డ్రైవింగ్ చేసి

ప్రమాదాలకు గురి కాకుండా అరికట్టాలి.

- గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

- వీడీసీలలో పూర్తిస్థాయిలో అరికట్టాలి.

- ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది

సిబ్బందికి అధికారులకు ప్రశంసా పత్రాలు

- నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించిన

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర)దుర్గాదేవి, శారదా దేవి నవరాత్రి నిమర్జన ఉత్సవాలకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సంసిద్ధమై ఉందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి ప్రత్యేక కార్యచరణను అవలంబించనున్నట్లు అందులో భాగంగానే మైనర్ డ్రైవింగ్, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల పరిధిలో రాజ్యాంగ విరుద్ధంగా విడీసీలు ఎలాంటి కార్యకలాపాలను నిర్వహించకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు

అందరూ జర్నలిస్టులే అయితే అదో పెద్ద సమస్య- సుప్రీంకోర్టు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర)అక్టోబర్ 16 : ప్రతి పౌరుడూ తనను తాను జర్నలిస్ట్ అని చెప్పుకోవడం మొదలుపెడితే, అది అందరికీ ఇబ్బందులు సృష్టిస్తుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేసిన ఫ్రీలాన్సర్లు, స్వతంత్ర జర్నలిస్టులు, రీల్స్ చేసేవారికి రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లనువిచారించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదిస్తూ.. ఫ్రీలాన్స్, స్వతంత్ర జర్నలిస్టులను ఢిల్లీ పోలీసులు గుర్తించడం లేదని, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) గుర్తింపు కార్డుఉంటేనేఅనుమతిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. మీడియా సంస్థలు జారీ చేసిన ఐడీ కార్డులు ఉన్న జర్నలిస్టుల విధులకు ఆటంకం కలగకుండా జాతీయ స్థాయిలో ఒక ప్రోటోకాల్రూపొందించాలని కోరారు.ఈ సమయంలో సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ "ప్రతిఒక్కరూజర్నలిస్టుగా మారితే ఎలాంటి సమస్యలు వస్తాయో కూడా మనం ఆలోచించాలి" అని హెచ్చరించారు. ఆర్టికల్ 19 ప్రకారం భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరుడికీ జర్నలిస్ట్ అయ్యే హక్కును ఇస్తుందా..? అనే దానిపై లోతైన పరిశీలన అవసరమని జస్టిస్ బాగ్చీ అభిప్రాయపడ్డారు. గుర్తింపు పొందిన, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు, ఇన్ఫ్లుయెన్సర్లు, రీల్స్ చేసేవారికి వేర్వేరు స్థాయుల్లో రక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ సోషల్ మీడియా పాప్యులారిటీ కోసం రీల్స్ చేస్తూ తమను తాము స్వతంత్ర జర్నలిస్టులుగా చెప్పుకుంటున్నారని తెలిపారు. మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరగకుండా రక్షణ కల్పించడాన్ని సమర్థిస్తూనే, అదే రక్షణ మహిళా పోలీసు సిబ్బందికి కూడా వర్తించాలని అన్నారు. వివిధవర్గాలజర్నలిస్టులకు అదనపు రక్షణ కల్పించే అంశంపై సమగ్ర విచారణ జరపాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. నిరసనల సమయంలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులు, వేధింపుల ఆరోపణలను తీవ్రంగాపరిగణిస్తున్నామని, స్వతంత్ర విచారణ అవసరాన్ని పరిశీలిస్తామని సూచించింది.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామం, మండలానికి చెందిన ఎం. అనూష ఎంబీబీఎస్ వైద్య విద్యలో సీటు సాధించి, వికారాబాద్‌లోని వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ అనూషను అభినందించి, స్వీట్స్ తినిపించి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని, అనూష తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలో చేరిన తర్వాత క్రమశిక్షణతో చదువుతూ, మంచి ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించాలని సూచించారు. భవిష్యత్తులో పీజీ వైద్య విద్యలో కూడా మంచి ర్యాంకు సాధించి, మరోసారి మెరిట్ ద్వారా సీటు పొందేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని ఎస్పీ సూచించారు. విద్య ద్వారానే జీవితాల్లో మార్పు వస్తుందని, మంచి విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజానికి సేవ చేసే అవకాశాన్ని పొందవచ్చని తెలిపారు.చదువుకు సంబంధించి అనూషకు ఎలాంటి సహకారం అవసరమైనా తనను సంప్రదించవచ్చని, తగిన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎస్పీ హామీ ఇచ్చారు. విద్యార్థులు తమ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. అనూష బ్రదర్ కానిస్టేబుల్ అరుణ్ కూడా ఉన్నారు.

ఏడు రోజుల లోపు నగదు రహిత వైద్య చికిత్స

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం... =ూూ అధికారి శ్రీనివాస్

భూపాలపల్లి జిల్లా 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) పిఎం రహత్ పథకంపై చెల్పూర్ చౌరస్తాలో రవాణా శాఖలల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం రహత్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతి ప్రమాద బాధితునికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు, ప్రమాదం జరిగిన తేదీ నుంచి 07 రోజుల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్, బస్ స్టాండ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లను ప్రదర్శించనున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం, పథకం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన సూచించారు. ఈ డార్ డిఆర్ఎం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించడంలో సంబంధిత శాఖల సమన్వయం, ప్రజల సహకారం కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంవిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి

రాజకీయ స్వార్థం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే నాయకులకే పట్టం కట్టాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 150 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పనిచేసే నాయకులను ప్రజలు ఆదరించాలని, రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఆలోచించకూడదని ఆయన పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అర్హత పొందిన 210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, మరో 150 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ.1,55,00,000 (రూ.1 కోటి 55 లక్షలు) విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆడపిల్లల వివాహాలు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, పేదల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ గుండు సుధారాణి,మాజీ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు,నాయకులు,అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని...

- పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊరట...

- వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 1 6 వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు...

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు వారికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వికాస్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో అనేక పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హులైన కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలో కూడా కీలకమని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సుమారు 16 వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- నాగర్ కర్నూలు ఎంపి మల్లు రవి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : ఎమ్మెల్సీ పట్టభద్రులు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పిలుపునిచ్చారు. పట్టభద్రులు ఆన్లైన్లో కానీ ఆఫ్లైన్లో కానీ నేరుగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల ఎన్నోపల్లిలోని సాకేత్ నగర్ లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తమ డిగ్రీ సర్టిఫికెట్ దానికి సమానమైన సర్టిఫికెట్ ఆధార్ కార్డ్ పాస్ ఫొటోస్ అప్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్నదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పట్టబద్రులను ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహాయ సహకారం అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డిని బరిలోకి దింపి, గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి ఓటర్ల నమోదు ప్రాథమిక సోపానం. అందుకే ప్రతి నియోజకవర్గంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ సినియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ పట్లోళ్ల మహిపాల్ రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పీలారం మల్లేశం, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్ మునివల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, శంకర్ యాదవ్ వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మామిండ్ల సత్తమ్మ మృతి పట్ల తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రగాఢ సంతాపం

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): డీసీసీ సెక్రటరీ ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, మాతృమూర్తి మామిండ్ల సత్తమ్మ కన్నుమూయడం తీవ్ర విచారకరం. ఆమె మృతి పట్ల మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తమ్మ గారి నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మామిండ్ల ముత్యాలు యాదవ్ గారితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలతో రైతులు అల్లాడుతున్నారు

సింగరేణిని నాశనం చేస్తూ తెలంగాణను చీకటిలోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి..

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవా లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో కరెంట్ లేక మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్ ఫార్మర్లు పేలుతున్నాయని, రైతుల పెట్టుబడి బూడిదపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో 4 గంటలు కూడా కరెంట్ ఇవ్వని దుస్థితి ఉందన్నారు. తెలంగాణకు జీవనాడి లాంటి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి, ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లడం దారుణమని అన్నారు. సింగరేణి బొగ్గు ఆగితే రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థే కుప్పకూలుతుందని, కానీ ప్రభుత్వానికి ముందుచూపు లేదన్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి విద్యుత్ అధికారులను బలి చేయడం సరికాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ డిమాండ్లు:

1. వెంటనే కరెంట్ కోతలు లేకుండా రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి.
2. కాలిపోయిన మోటార్లు, పంట నష్టానికి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.
3. సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలి.
4. కరెంట్ కోతలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి.

ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ , కౌన్సిలర్ లు చిలువేరీ వెంకన్న నాగుబాయి , దూదల లక్ష్మి , బి ఆర్ ఎస్ నాయకురాలు మారుసుకోలా సరస్వతి , బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జాబోర్ రవీందర్, నాయకులు సాయి శ్రావణ్, శ్రీనివాస్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అర్ధరాత్రి 'ఆపరేషన్ కవచ్'

- నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై పోలీసుల ప్రత్యేక నిఘా,

- 100 బృందాలు.. 3,000 మంది సిబ్బందితో విస్తృత నాకాబందీ,

- స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సీపీ సజ్జనర్,

- 725 వాహనాలు డిటైన్.. 48 మంది అనుమానితులు అదుపులోకి,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో అర్ధరాత్రి వేళ పోలీసులు ఆపరేషన్ కవచ్ పేరిట నాకాబందీ తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 16న గురువారం అర్ధరాత్రి 1:00 గంట నుంచి తెల్లవారుజామున 3:00 గంటల వరకు నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 100కు పైగా బృందాలు, దాదాపు 3,000 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సిటీ కమిషనరేట్ వ్యాప్తంగా జరుగుతున్న తనిఖీలను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. చంద్రాయణగుట్ట పరిసరాల్లో కాలినడకన తిరిగి వాహనాల తనిఖీలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, అనంతరం మైలార్‌దేవ్‌పల్లి మెహఫిల్ హోటల్ సమీపంలో, ఆరాంఘర్ ఆర్‌జీఐఓ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంషాబాద్ సతమ్రాయ్ వద్ద, అత్తాపూర్ పోలీసులు నిర్వహించిన హైదర్‌గూడ పిల్లర్ నెం. 133 వద్ద, బండ్లగూడ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో వాహన తనిఖీలను పరిశీలించి అధికారులకు తగిన మార్గదర్శకాలు అందించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 725 వాహనాలను పోలీసులు డిటైన్ చేయగా, 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే 5 మైనర్ డ్రైవింగ్ కేసులు, ఒక ఆయుధం, 2 గంజాయి సంబంధిత కేసులతో సహా పలు ఇతర కేసులు నమోదయ్యాయి. జోన్ల వారీగా పరిశీలిస్తే.. గోల్కొండ జోన్‌లో అత్యధికంగా 213 వాహనాలు డిటైన్ కాగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు; ఇక్కడ 2 మైనర్ డ్రైవింగ్, ఒక గంజాయి కేసు నమోదైంది. శంషాబాద్ జోన్‌లో 182 వాహనాలను డిటైన్ చేశారు. చార్మినార్ జోన్‌లో 127 వాహనాలను డిటైన్ చేసి, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఒక ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్‌లో 100 వాహనాలను డిటైన్ చేసి, 21 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు; ఇక్కడ ఒక గంజాయి కేసు, ఒక డ్రంక్ అండ్ డ్రైవ్, 23 ఈ-పెట్టీ కేసులు నమోదయ్యాయి. సికింద్రాబాద్ జోన్‌లో 45 వాహనాలు డిటైన్ కాగా, 2 మైనర్ డ్రైవింగ్, ఒక సి ఓ టి పి ఏ, కేసు నమోదైంది. ఖైరతాబాద్ జోన్‌లో 40 వాహనాలు, జూబ్లీహిల్స్ జోన్‌లో 18 వాహనాలను డిటైన్ చేసి, 23 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్‌లో ఒక మైనర్ డ్రైవింగ్, 8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్, మాట్లాడుతూ, నేరస్థులు పోలీసుల నిఘా నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను వంచడం, అక్షరాలు కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనివల్ల వారు తీవ్రమైన నేర కేసుల్లో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. నంబర్ ప్లేట్లను ఉద్దేశపూర్వకంగా మార్చే వారిపై చీటింగ్, ఫోర్జరీ వంటి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లను స్పష్టంగా ఉంచుకోవాలని, వాహనం నడుపుతూ ఇయర్‌ఫోన్లు ధరించకూడదని, వాహన సంబంధిత ధ్రువపత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. నగరంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పౌరులంతా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్ కవచ్ తనిఖీల్లో అదనపు సీపీలు ఎం.శ్రీనివాసులు (క్రైమ్స్), తఫ్సీర్ ఇక్బాల్ (లా అండ్ ఆర్డర్), జాయింట్ సీపీ డి.జోయల్ డెవిస్ (ట్రాఫిక్), డీసీపీలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.చైతన్య కుమార్, కిరణ్ ఖారే, కె.శిల్పవల్లి, ఎస్.శ్రీనివాస్, జె.రాఘవేందర్ రెడ్డి, ఎ.రమణారెడ్డి, బి.రాజేష్, కె.వెంకటలక్ష్మి, లావణ్య నాయక్ జాదవ్ తదితర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల కోసం జరిగే రథయాత్రను జయప్రదం చేయాలి

- సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ పిలుపు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 16 : సిద్దిపేట జిల్లాలో అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లుకల్పించాలని, ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ అక్టోబర్ 24, 25, 26 తేదీల్లో తెలంగాణలో నిర్వహించనున్న రథయాత్రను జయప్రదం చేయాలని సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కోసం ప్రవీణ్ ఆరోర్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల కిలోమీటర్ల మేర చేపట్టిన రథయాత్ర అక్టోబర్ 2న ఢిల్లీలోని బాబూజీ ఘాట్ నుంచి ప్రారంభమైందని తెలిపారు. ఈ యాత్ర అక్టోబర్ 24, 25, 26 తేదీల్లో తెలంగాణలో ప్రవేశించనున్న నేపథ్యంలో వేలాది మంది పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో రథయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా ఈ ఉద్యమం కొనసాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు మా రెడ్డి రాంలింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, రెడ్డి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు దొంగల బాపు రెడ్డి, ముత్యాల దేవేందర్ రెడ్డి, రామంచ చంద్రారెడ్డి, అయిలేని గాల్ రెడ్డి, నిమ్మ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రధాని కరోనాను ఎదుర్కొన్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎల్ నీనో ఎదుర్కోవాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 16 అక్టోబర్ : తెలంగాణలోగతంలో ప్రధాని మోది పిలుపుతో ఏకమై కరోనాను ఎదుర్కొన్నట్లే ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపుతో ఎల్ నినో ను ఎదుర్కునేందుకు ప్రజలు, రైతులు సహకరించాలి... రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన మరియు కనుల శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామ శుక్రవారం దుబ్బాక నియోజకవర్గం దుబ్బాక, భూంపల్లి-అక్బర్పేట్, మీర్దొడ్డి రాయపోలు, దౌలతాబాద్, తోగుట మండలాలకు చెందిన 211 మంది టు బిహెచ్కె లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు, 179 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 1 కోటి 79 లక్ష 20 వేల రూపాయలకు విలువైన చెక్కులను దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన మరియు గనులశాఖ మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరాం సంగీత, సిద్దిపేట ఆర్డిఓ సదానందం, 2 బిహెచ్కె కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి కామెంట్:

దుబ్బాక నియోజకవర్గం లోని టు బిహెచ్కె ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి ఈరోజు పట్టాలు ఇస్తున్నాము. రాష్ట్రంలో పక్కా ఇండ్లు లేకుండా ఎవరు గుడిసెలలోనివసించరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్నితీసుకువచ్చారు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మా ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇండ్లు ఇచ్చాము.మరో 3000 కేవలం సిద్దిపేట జిల్లాలో ఇస్తున్నాము. త్వరలోనే రెండవసారి లబ్ధిదారుల ఎంపిక పూర్తి అవుతుంది. 414 కోట్లకు జిల్లాలో మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా చేశారు.ముందుగా చెప్పినట్లుగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి పేద ప్రజలకు లబ్ధి చేకూరుస్తుంది. గృహజ్యోతి, సన్నబియ్యం, గృహలక్ష్మి పథకాలతో లబ్ధించే కురుస్తుంది. ఎన్నో ఏళ్లకు ఎదురు చూసిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసాము. త్వరలో నూతన ఆసరా పింఛన్ ఇవ్వనున్నాము. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చేయని విధంగా మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం 23 వేల కోట్ల రూపాయలతో రైతు రుణమాఫీ చేసాము. ప్రధానమంత్రి మోదీ పిలుపుతో కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వ సూచనలను పాటించి ఆ విపత్తు నుంచి బయటపడ్డాము. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో ఎల్ నినో ను ఎదుర్కొనేందుకు రైతులు,ప్రజలుప్రభుత్వానికి సహకరించాలి. మన ఒక్క రాష్ట్రంలోనే కాదు. వివిధ దేశాలతో పాటు దేశవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉంది. ఎల్ నినో ప్రభావంతో వచ్చే జూన్ వరకు వర్షం రాదు.సాగునీరు లేదు కాబట్టి ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలి. వరి వేయవద్దు. నిన్న రాష్ట్ర ప్రభుత్వం ఎల్ నీనోను ఎదుర్కొనేందుకు సబ్ కమిటీని వేసింది. రిజర్వాయర్ లలో ఉన్న నీటిని జాగ్రత్తగా త్రాగునీటి అవసరాల కోసం వాడుకోవాలి. గత సంవత్సరం ఈ సమయానికి రాష్ట్రంలో 15000 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా ఈసారి వర్షాభావ పరిస్థితులతో ఇప్పుడు 20000 మెగావాట్ల వినియోగం జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల బోర్లు ఉన్నాయి. 9:30 గంటలు విద్యుత్ సరఫరా చేస్తాము.

దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి కామెంట్స్:-

టు బిహెచ్కెలను పూర్తి చేసి గతంలో పంపిణీ చేశాము.పెండింగ్ లో ఉన్నా 2 బిహెచ్ కె ఇండ్లకు ఈ రోజు పూర్తి స్థాయిలో ఇస్తున్నాము. ఇతర జిల్లాల వాళ్లు అనర్హులు ఇండ్లలో ఉన్నారు. వారిని తొలగించి స్థానిక లబ్ధిదారులకు అందించాలి.దుబ్బాక నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్నా ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చెయ్యాలి.ఎల్ నేనో ప్రభావంతో వర్షాభావంతో నీళ్ళు లేక రైతులు బాధలో ఉన్నారు. పంటలు చివరి స్థాయిలో ఉన్నాయి. నీళ్లు వదలాలి.విద్యుత్ కూడా సరిపోయే స్థాయిలో ఇవ్వాలి.జిల్లా కలెక్టర్ కే. హైమావతి కామెంట్స్ కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్, కొత్తరేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్, మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం తదితర అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. వాటిని లబ్ధిదారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ప్రభుత్వం దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభం ప్రారంభించనుంది. త్వరలో విద్యార్థుల ప్రభుత్వ స్కూళ్లలో బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభంకానున్నది.

శృంగేరి గుడిలో మూల నక్షత్ర మహోత్సవ వేడుకలు..

- శారదా మాతకు సప్త హారతులు.., - వీణపాణిగా అమ్మవారి అలంకరణలు..

సిద్దిపేట , జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట సమీపంలోని కిష్ట సాగర్ వద్దనున్న శృంగేరి గుడిలో శుక్రవారం మూల నక్షత్ర వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శారద మాత అమ్మవారిని సరస్వతి మాత (వీణపాణి) రూపకంగా అలంకరించారు. ఉదయం కుంకుమార్చనలు జరిగాయి. వేద పండితులు దీక్షితుల ఆధ్వర్యంలో అమ్మవారికి సప్త హారతిని ఇచ్చారు. ఉత్సవంలో భాగంగా సుహాసిని పూజ నిర్వహించారు. సిద్దిపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదలను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మాధికారి కిషన్ సింగ్ తెలిపారు. విజయదశమి సందర్భంగా నిర్వహించే చండీహోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగాలకు భారీ స్పందన

హనుమకొండ జిల్లాలో 51 పోస్టులకు 2,530 మంది అభ్యర్థుల దరఖాస్తులు

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) కార్యక్రమం కింద వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మొత్తం 51 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆయా పోస్టులకు మొత్తం 2,530 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

పోస్టుల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు

1. పీడియాట్రిషియన్ / మెడికల్ ఆఫీసర్: 4 పోస్టులకు 51 దరఖాస్తులు.
2. మెడికల్ ఆఫీసర్ (బ్లడ్ బ్యాంక్): 1 పోస్టుకు 33 దరఖాస్తులు.
3. స్టాఫ్ నర్సులు: 12 పోస్టులకు 922 దరఖాస్తులు.
4. ఏఎన్ఎంలు (ఏఎన్ఎం): 16 పోస్టులకు 467 దరఖాస్తులు.
5. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎం ఎల్ హెచ్ పి): 8 పోస్టులకు 364 దరఖాస్తులు.
6. ల్యాబ్ టెక్నీషియన్లు: 5 పోస్టులకు 335 దరఖాస్తులు.
7. ఫార్మసిస్టులు: 2 పోస్టులకు 308 దరఖాస్తులు.
8. సైకియాట్రిస్ట్: 1 పోస్టుకు 3 దరఖాస్తులు.
9. ల్యాబ్ మేనేజర్: 1 పోస్టుకు 27 దరఖాస్తులు.
10. ఎపిడెమియాలజిస్ట్: 1 పోస్టుకు 20 దరఖాస్తులు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపడుతున్న ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు.

లాటరీ పద్ధతిన బార్ కేటాయింపు ..

- జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర) : లాటరీ పద్ధతిన బార్ ను కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి తో కలిసి ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి మంజూరైన నూతన బార్ ను లక్కీ లాటరీ పద్ధతిలో కేటాయింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి నూతన బార్ అండ్ రెస్టారెంట్ మంజూరు కాగా, ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, మొత్తం 207 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వారి సమక్షంలో లక్కీ లాటరీ పద్ధతిన 102 నెంబరు గల మల్లు గారి రమేష్ గౌడ్ ను లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. బార్ నిర్వహణలో ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటిస్తూ, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆబ్కారీ మధ్య నిషేధశాఖ అధికారి లక్ష్మీ నాయక్, సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- దసరా సెలవుల్లో ఊరెళుతున్నారా జరభద్రం
- ఖాళీ ఇళ్లలో చోరీలు జరగకుండా ప్రత్యేక పోలీస్ గస్తీ
- ఇళ్ల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జర భద్రంగా ఉండాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూదసరా పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లే ముందు తలుపులు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, వెనుక తలుపులు, బాల్కనీలను కూడా తనిఖీ చేసుకోవాలని సూచించారు. బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయడంతో పాటు, ఎక్కువ రోజుల పాటు ఇంట్లో ఎవరూ ఉండని సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, భద్రతా అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ప్రయాణ వివరాలు, ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. ఇంటి తాళాలను బయట కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదని స్పష్టం చేశారు. ఇంటి నుంచి బయలుదేరే ముందు అవసరం లేని విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను మూసివేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను సురక్షితమైన ప్రదేశాల్లో పార్క్ చేసి, హ్యాండిల్ లాక్‌తో పాటు ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.దసరా సెలవుల సమయంలో ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం డయల్ 112కు లేదా 24 గంటలు అందుబాటులో ఉండే పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670399 ఫోన్ చేయాలని సూచించారు. దసరా పండుగ సెలవులను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గోపాలపురంలో సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : గ్రేటర్ వరంగల్ 56 డివిజన్ గోపాల పురం లో సద్దుల బతుకమ్మ సందర్భంగా అరక సాయి కుంట(బతుకమ్మ చెరువు)వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని గోపాలపురం కంటెస్టెడ్ కార్పొరేటర్ రావుల వెంకట రమేష్ గౌడ్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు గోపాలపురం పరిధిలోని మహిళలు సద్దుల బతుకమ్మకు అరక సాయికుంట(బతుకమ్మ చెరువు)కు వేలాదిగా తరలివస్తారని వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు విద్యుత్ దీపాలు త్రాగునీరు వైద్య సేవలు పోలీస్ మున్సిపల్ కార్మికుల సేవలు అత్యవసరం ఉన్నందున అరక సాయి కుంట(బతుకమ్మ చెరువు) ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని గోపాలపురం ప్రజల పక్షాన వెంకట రమేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భరత్ నగర్ కాలనీలో నాగిరెడ్డి గారి ఆహ్వానం మేరకు, మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులో తూము మనోజ్ గారి ఆహ్వానం మేరకు, బాలాజీ నగర్‌లో కృష్ణ రాజ్‌పుత్ గారి ఆహ్వానం మేరకు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భక్తులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఉచితంగా కంటి, చెవి, ఎముకలు, ప్లాస్టిక్ సర్జరీలు

కాగజ్‌నగర్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ (రైలు పట్టాలపై ఆసుపత్రి) వైద్య సేవలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఈ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు ఆసుపత్రి ద్వారా కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత శస్త్రచికిత్సలు, చిన్నారులకు సంబంధించిన ఎముకల ఆపరేషన్లు, ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ఈ సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు సిర్పూర్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన రోగులకు ఈ సేవల గురించి తెలియజేసేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిడం నాగేంద్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ అవినాష్‌లకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన రోగులు వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, తహసీల్దార్ మల్లెపూల మధుకర్, ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టీ డాక్టర్ రోహిణి చౌగులే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రోగులు, వారి బంధువులు హాజరయ్యారు. నవంబర్ 5వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ వైద్య సేవలను అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

హుస్నాబాద్ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక

హుస్నాబాద్‌లో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వ జీవో జారీ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 విజన్ ఆంధ్ర : మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గంలో బాలబాలికలకు క్రీడల్లో శిక్షణకు అవకాశం 40 మంది క్రీడాకారులకు వసతితో కూడిన కబడ్డీ అకాడమీ ఏర్పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గారి కృషితో హుస్నాబాద్ నియోజకవర్గంలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ అకాడమీ ఏర్పాటు కానుంది.

కబడ్డీ అకాడమీ జీవోలోని ముఖ్యాంశాలు:

హుస్నాబాద్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లాలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి. అకాడమీలో మొత్తం 40 మంది క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు. ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలు ఉంటారు- బాలురు, బాలికలకు వేర్వేరుగా కబడ్డీ కోచ్‌లను నియమించనున్నారు- బాలురు, బాలికల కోసం వేర్వేరుగా వార్డెన్లతో పాటు గ్రౌండ్స్‌మెన్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు- మొత్తం 8 సేవల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది- ఈ నియామకాలు ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టనున్నారు



క్రీడాకారులకు ప్రయోజనం

ఈ అకాడమీ ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువ క్రీడాకారులకు కబడ్డీలో శిక్షణ పొందేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. బాలురు, బాలికలకు సమానంగా అవకాశం కల్పించడం ద్వారా క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడనుంది. హుస్నాబాద్ ప్రాంతంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ అకాడమీ ఏర్పాటు కీలక అడుగుగా నిలవనుంది.ఇప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గంలోనీ గ్రామాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు సాధించారు. కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని పల్లెల్లో మట్టిలో మాణిక్యాలు వెలికి తీసి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయవచ్చని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జీవో వివరాలు: G.O.Rt.No.1660, ఆర్థిక శాఖ (HRM.VII), తేదీ: 15-10-2026. మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడాకారులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రావడంపై నియోజకవర్గ ప్రజలు , విద్యార్థులు , యువత స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కొత్త కిషోర్ గౌడ్ మార్నింగ్ వాక్

కాలనీలలో మెరుగైన మౌలిక వసతుల కోసం నిరంతర కృషి

నూతన సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్ కు కాలనీవాసుల వినతి

బోడుప్పల్,అక్టోబర్ 16(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని రాజలింగం కాలనీ పేజ్-2 కాలనీలో మేడ్చల్ జిల్లా బిజ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ కాలనీవాసులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. కాలనీవాసుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల వస్తువులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తూ, నూతన సీసీ రోడ్ల అభివృద్ధి కోసం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ వినతిపత్రం అందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటూ, కాలనీ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న కిషోర్ గౌడ్ కి కాలనీ వాసుల తరఫున అధ్యక్షుడు రూపని రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రూపని విష్ణు, ప్రధాన కార్యదర్శి బానోతు విటల్, ఉపాధ్యక్షులు ఎన్ యాదగిరి, విష్ణుమూర్తి చారి,రామ్ రెడ్డి, కోశాధికారి గూడ వేణు,వర్కింగ్ ప్రెసిడెంట్లు శ్రీనివాస్,నవీన్ రెడ్డి, సుశ్రీత్,కార్యదర్శులు హనుమంతు, అజయ్,అమరేందర్ రెడ్డి,సునీత్, రవి నాయక్,అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా గందే విశ్వేశర్ గుప్తా

నియామక పత్రం అందజేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

బోడుప్పల్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా గందే విశ్వేశర్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గందే విశ్వేశర్ గుప్తా మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు బోడుప్పల్ నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, మాజీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని విశ్వేశర్ గుప్తా పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చెంగిచెర్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కుర్రి మహేష్

నియామక పత్రం అందజేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

బోడుప్పల్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కుర్రి మహేష్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయనను నియమిస్తూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుర్రి మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.బోడుప్పల్ నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, చెంగిచెర్ల డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మహేష్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్

భూపాలపల్లి జిల్లా: భూపాలపల్లి టౌన్ 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి సింగరేణి కమ్యూనిటీ హాల్ లో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సైబర్ క్రైమ్ -- "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి ఓ్రూలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, సైబర్ నేరగాళ్లు చెప్పే ఆకర్షణీయమైన ఆఫర్లు, అధిక లాభాల ఆశలకు లోనుకావద్దని హెచ్చరించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్,సైబర్ క్రైమ్ ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివ కుమార్, విద్యార్థులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి పంటలను కాపాడండి

కోసిని ప్రాజెక్టు నుంచి భామనగండి చెరువుకు సాగునీరు విడుదల చేయాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా.. అనంతరం వినతిపత్రం సమర్పణ

కాగజ్‌నగర్ అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న వరి పంటలను కాపాడేందుకు కోసిని ప్రాజెక్టు నుంచి భామనగండి చెరువుకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తమ సమస్యలను వివరించారు. కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల పరిధిలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదని రైతులు తెలిపారు. దీంతో సాగునీరు అందక వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంటల సాగు కోసం రైతులు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి పంటకు చివరి రెండు తడులు అందిస్తే పంట చేతికి వచ్చే అవకాశం ఉందని, ఇలాంటి కీలక సమయంలో నీరు అందకపోతే నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు దెబ్బతింటే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి కుటుంబాల జీవనోపాధి కూడా ప్రమాదంలో పడుతుందని తెలిపారు. రైతుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకొని కోసిని ప్రాజెక్టు నుంచి భామనగండి చెరువుకు తక్షణమే నీటిని విడుదల చేసేలా సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడం అత్యంత కీలకమని, నీటి విడుదలలో ఆలస్యం జరిగితే వరి పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు కోలుకోలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సాధారణ వినతిగా కాకుండా రైతుల జీవనోపాధికి సంబంధించిన అత్యవసర సమస్యగా గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చే చివరి దశలో సాగునీరు అందక రైతులు నష్టపోవడం బాధాకరమని, తక్షణమే నీటిని విడుదల చేసి కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల రైతుల వరి పంటలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, రైతు సంఘం నాయకులు మాదారపు శ్రీనివాసరావుతో పాటు రైతులు పెరిసింగుల వినోద్, టాక్రే మధు, రామిళ్ల శంకర్, ఆదే శ్రీనివాస్, లెండుగురె ఒమాజీ, మధునయ్య, పులగం రవి, లెండుగురి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ లైన్ ఎక్స్ ప్రెస్ ద్వారా అందించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఎక్స్ప్రెస్ ద్వారా అందించే వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ లో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఎక్స్ప్రెస్ లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఎక్స్ప్రెస్ లో ఈ నెల 16 నుండి నవంబర్ 5వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టి ఎక్కువ మంది ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ శిబిరంలో కంటి, చెవి, ఆర్థోపెడిక్, పెదవి చీలిక, కాలిన గాయాలు, దంత చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ వైద్య సేవలు అందిస్తారని, ఫౌండేషన్ ట్రస్ట్ వారికి ప్రజలు సహకరించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ కాగజ్ నగర్ లో లైఫ్ లైన్ ఎక్స్ప్రెస్ రైలు ద్వారా ఈ ప్రాంతంలో 2వ సారీ వైద్య సేవలు అందించడానికి ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ వారు ముందుకు వచ్చారని, 1991లో ఈ ఫౌండేషన్ ద్వారా ప్రారంభమైన ఈ రైలు ఇప్పటివరకు అనేక రాష్ట్రాలలో 256 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ లో 2022లో సేవలు అందించారని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఫౌండేషన్ నిర్వాహకులు డా. రోహిణి, డా. మనోహర్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్ల

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచనల మేరకు, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య నూతనంగా నిర్మించిన నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రజలకు త్వరితగతిన ఓపీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సదుపాయాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వైద్య సేవల పర్యవేక్షణ జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య గారు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది హాజరు, వైద్య సేవల నిర్వహణను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పరకాల పరిధిలోని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మొత్తం 25 మందికి గాను 11 మంది గైర్హాజర్ హాజరైనట్లు గుర్తించారు. అలాగే కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కనపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో మొత్తం 10 మందికి గాను 6 మంది గైర్హాజర్ హాజరైనట్లు పరిశీలనలో గుర్తించారు.సిబ్బంది కొరత కారణంగా సాధారణ ప్రజలకు వైద్య సేవలు నిలిచిపోకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు డాక్టర్ అప్పయ్య గారు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర వైద్య సేవలు, ఓపీ సేవలు మరియు ఇతర కీలక ఆరోగ్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ దివ్య, ఎం పి హెచ్ ఈ ఓ రాజ కుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు

హిందూ దేవీదేవతలను కించపరిచే పోస్టులను సహించబోం - కృష్ణ నాయక్,

ఫలక్‌నుమ పోలీస్ స్టేషన్‌లో ఎన్ బి ఎం ఐ, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఫిర్యాదు,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో): హిందూ దేవీదేవతలను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ప్రచురిస్తే సహించబోమని జాతీయ బంజారా మిషన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ నాయక్ ఎస్ కె ఎన్ స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో హిందూ దేవత స్వరూపంలో ఒక మహిళ ఫొటోను ప్రచురించిన అంశంపై జాతీయ బంజారా మిషన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫలక్‌నుమ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రాజేశ్వర్ రెడ్డికి ఫిర్యాదును అందజేసి, సంబంధిత పోస్టుపై సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ, హిందూ దేవీదేవతల పట్ల భక్తులకున్న విశ్వాసాలు, మతపరమైన మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, మతపరమైన సామరస్యానికి భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సంబంధిత పోస్టు చేసిన వ్యక్తి యావత్ హిందూ సమాజానికి వీడియో క్లిప్ ద్వారా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ బి ఎం ఐ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ నాయక్ ఎస్ కె ఎన్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్, న్యాయవాది రవిరాజు రాథోడ్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.

పైప్‌లైన్‌లు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించిన అంచనాలు, అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

భూపాలపల్లి జిల్లా 16 అక్టోబర్ (విజన్ ఆంధ్ర) : అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు, పైప్‌లైన్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్ సెంటర్ నుండి కృష్ణ కాలనీ, ఓసి 2 వరకు రోడ్లు వెడల్పులో సింగరేణి సంస్థ పైప్‌లైన్‌లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి సమగ్ర అంచనాలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ద్వారా చేపట్టే పనుల్లో అనవసర ఖర్చులను తగ్గించి, నిర్దేశిత బడ్జెట్‌లోనే నాణ్యతతో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. పనుల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, మున్సిపల్. కమిషనర్ ఉదయ్ కుమార్, సింగరేణి, పీఆర్, విద్యుత్తు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర ప్యాకేజింగ్‌పై టీజీ-ప్యాక్‌కాన్‌లో చర్చలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): ప్యాకేజింగ్ రంగంలో సుస్థిరత, ఆవిష్కరణలు, రీసైక్లింగ్, ఆటోమేషన్, ఎగుమతి పోటీతత్వాన్ని పెంపొందించడంపై సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీజీ-ప్యాక్‌కాన్ 2026లో చర్చించారు. సీఐఐ తెలంగాణ ఛైర్మన్ ఎం.గౌతమ్ రెడ్డి, టీజీ-ప్యాక్‌కాన్ ఛైర్మన్, ఎక్కోబ్లిస్ ఇండియా సీఎండీ ఏవీపీఎస్ చక్రవర్తి, ఏపీఈడీఏ ప్రాంతీయ అధిపతి ఆర్.పి.నాయుడు, సీడీఎస్‌సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్(ఇండియా) డా.నరేంద్రన్, సీఐఐ తెలంగాణ వైస్ ఛైర్మన్ గౌరవ్ మహేశ్వరి పాల్గొని పర్యావరణహిత ప్యాకేజింగ్, ఔషధ నాణ్యత, ఆహార భద్రత, ప్రపంచ మార్కెట్లకు అనుగుణమైన ప్రమాణాల ఆవశ్యకతను వివరించారు. సుస్థిర పదార్థాలు, వలయాకార ఆర్థిక వ్యవస్థ, నియంత్రణ ప్రమాణాలు, డిజిటల్ సరఫరా గొలుసులపై సదస్సులో చర్చలు జరిగాయి.

షూటాఫ్‌లో చోళ చీఫ్స్ సంచలన విజయం



హైదరాబాద్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ జట్టు పృథ్వీరాజ్ యోధాస్‌పై సంచలన విజయం సాధించింది. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగిన మ్యాచ్‌లో నాలుగు సెట్లు ముగిసేసరికి 4-4తో స్కోరు సమం కాగా, హిట్-ఆర్-మిస్ షూటాఫ్‌లో చోళ చీఫ్స్ 2-0తో గెలిచింది. అలెక్సాండ్రా ఉస్కియానో (కొలంబియా), యుక్త శ్రీ(భారత్) షూటాఫ్‌లో సత్తాచాటారు. ఉస్కియానో 80కి 80 పాయింట్లు సాధించింది. వరుసగా ఐదు ఓటముల తర్వాత గెలిచిన చోళ చీఫ్స్ నాలుగు పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలు నిలుపుకోగా, పృథ్వీరాజ్ యోధాస్ ఆరు పాయింట్లతో కొనసాగుతోంది. అక్టోబర్ 17న ఎలిమినేటర్-1, అక్టోబర్ 18న ఫైనల్ జరగనున్నాయి.

మహంకాళి దేవాలయంలో మహిళల పూజలు



నారాయణపేట ,అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి దేవాలయం మహిళలతో కిక్కిరిసి పోయింది ఆదిపరాశక్తి సరస్వతి మాత అవతారంలో దర్శనమివ్వడంతో మహిళలు పెద్ద సంఖ్య లో పాల్గొని అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి సాంప్రదాయపద్దతిలో బియ్యం గాజులు పసుపు కుంకుమ గాజులు పువ్వులతో ఒడినింపి మొక్కుబడులు చెల్లించుకున్నారు అంతకుముందుఅర్చకులు అమ్మవారి మూల విరాట్ విగ్రహనికి మహా అభిషేకం కుంకుమార్చన మహాఅలంకరణ నైవేద్యం మహా మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు భక్తులు మహిళలు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

5,11116 ఐదు లక్షల వెయ్యినూట పదహారు రూ. లతో అమ్మవారి అలంకరణ

- వాసవి క్లబ్ వారిచే సన్మానాలు, గేమ్స్

మక్తల్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అంగరంగ వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగు తున్నాయి. అందులో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి అభిషేకము కలశపూజ అనంతరం సాయంత్రము బతుకమ్మ , వాహన సేవలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్దలకు, వాసవి క్లబ్ సభ్యులకు జ్ఞాపిక అందించి, పట్టణ పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన అతిథులకు సన్మానించుకోవడం జరిగింది. అలాగే చిన్నారులచే ఫ్యాషన్ షో, పెద్దలకు గేమ్స్, దంపతులకు బెలూన్ గేమ్స్ నిర్వహించి ఎంతో ఆహ్లాదంగా కార్యక్రమాన్ని మక్తల్ పట్టణ పరిసర గ్రామాల నుండి విచ్చేసిన వారందరికీ వేదికగా కృతజ్ఞతలు తెలుపుకొని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, వాసవి క్లబ్ సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్– 2026 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించిన టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు ప్రతినిధి బృందం. హాజరైన సినీ దర్శకుడు హరీష్ శంకర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, చరణ్ అర్జున్, నల్గొండ గద్దర్ తదితరులు. ఈ నెల 17న శిల్పకళా వేదికలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం.

బతుకమ్మ సంప్రదాయ పాటల పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన 'బతుకమ్మ : ట్రెడిషనల్ సాంగ్స్ అండ్ కల్చర్' పుస్తకాన్ని శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్(ఓజీఎస్)లో తిరునగరి దేవకీదేవి ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, రచయిత డా.సత్యనారాయణ ద్యావనపల్లి రచించారు. ఈ సందర్భంగా దేవకీదేవి మాట్లాడుతూ బతుకమ్మ పాటలు తెలంగాణ మహిళల జీవన విధానం, కుటుంబ సంబంధాలు, ప్రకృతితో అనుబంధం, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. వేదకుమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. రచయిత డా.సత్యనారాయణ ద్యావనపల్లి మాట్లాడుతూ బతుకమ్మ పాటలు మహిళల మౌఖిక చరిత్రకు, సామాజిక స్మృతికి నిదర్శనమని తెలిపారు. బతుకమ్మ పాటలు, చరిత్ర, ఆచారాలు, సాంస్కృతిక విశిష్టతలను ఇందులో వివరించారు. ఈ కార్యక్రమంలో సులోచనా రాణి, ఓజీఎస్ డైరెక్టర్ ప్రార్థన, డక్కన్ క్రైస్‌కు చెందిన సుదర్శన్, భాగ్య నరేందర్, ఎన్ఆర్ఐ నవత, బాలరాజ్, కట్ట ప్రభాకర్, సచిన్, ఖైజర్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గోయేగామ్, ఉషగామ్ గ్రామాల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఆత్రం సుగుణక్క మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేసిన డీసీసీ అధ్యక్షురాలు

కాగజ్‌నగర్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐక్యతతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కెరమెరి మండలంలోని గోయేగామ్, జైనూర్ మండలంలోని ఉషగామ్ గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో తమదైన ముద్ర వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బతుకమ్మ వంటి పండుగలు మహిళల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెబుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామ మహిళలు పాల్గొని బతుకమ్మ పాటలు, ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు

ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ రాజ్యం!

- పెంట్లవెల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి నిర్లక్ష్యంపై భగ్గుమంటున్న ప్రజాగ్రహం
- రోగులను పట్టించుకోని వైద్యాధికారి.. గాలిలో కలిసిపోతున్న కలెక్టర్ ఆశయాలు
- మంచినీటి చుక్క కూడా దొరకక అల్లాడుతున్న రోగులు







పెంట్లవెల్లి, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : "జీతం ప్రభుత్వానిది.. వైద్యం ప్రైవేటుది" అన్న చందంగా మారింది నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి తీరు. ప్రభుత్వ ధనంతో వేలాది రూపాయల జీతం తీసుకుంటూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్యం అందించాల్సిన కనీస బాధ్యతను ఆ డాక్టర్ గాలికి వదిలేశారు. జిల్లా కలెక్టర్ అమలు చేస్తున్న ఆదర్శవంతమైన, పారదర్శక పాలనకు తూట్లు పొడుస్తూ.. "నన్నడిగేవాడెవరు?" అన్నట్లుగా వ్యవహరిస్తున్న వైద్యాధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యాహ్నం 12 గంటలైనా ఆసుపత్రిలో అందని వైద్యం!

సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రులు ఉదయం 9 గంటలకల్లా తెరుచుకుని, వైద్యుల రాకతో రోగులతో కిటకిటలాడాలి. కానీ, పెంట్లవెల్లి పీహెచ్‌సీలో మాత్రం నిబంధనలకు తిలోదకాలిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా వైద్యాధికారి జాడ లేకపోవడం దారుణం. ఆ సమయంలో ఆసుపత్రిలో కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు అటెండర్లు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక వాచ్‌మెన్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. కీలకమైన వైద్యాధికారే గైర్హాజరు కావడంతో.. మారుమూల గ్రామాల నుంచి నానా అవస్థలు పడుతూ, అప్పులు చేసి వస్తున్న నిరుపేద రోగులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది.

దాహార్తిని తీర్చే నాథుడే కరువు!

వైద్యం అందించాల్సిన డాక్టరే సమయానికి రాకపోగా.. కనీసం ఆసుపత్రికి వచ్చే రోగులకు గొంతు తడుపుకోవడానికి గుక్కెడు మంచినీరు కూడా దొరకని దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించడంలో వైద్యాధికారి ఎంతటి నిర్లక్ష్యంగా ఉన్నారో దీనిబట్టి స్పష్టమవుతోంది. కనీసం త్రాగునీటిని కూడా ఏర్పాటు చేయలేని అసమర్థతపై రోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా?

ఒకవైపు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో కొందరు వైద్యాధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డి ఎం హెచ్ ఓ) పర్యవేక్షణ లోపమో, లేక అధికారుల ఉదాసీనతో ఇందుకు కారణమో ఇట్టే అర్థమవుతోంది.

కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

?ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన వైద్యుడే విధులను విస్మరించి ప్రైవేట్ పనులకు, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రజాధనాన్ని జీడిపప్పులా తింటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి బరితెగించిన వైద్యాధికారిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి సస్పెన్షన్ వేటు వేయాలని.. స్వయంగా జిల్లా కలెక్టర్ ఈ ఉదంతంపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వైద్యుడు లేడు అనే విషయాన్ని జిల్లా డిఎంహెచ్ఓ దృష్టికి 10:49 నిమిషాలకు చరవాణి ద్వారా తీసుకెళ్లగా , డిప్యూటీ డిఎంహెచ్వో గారికి విషయాన్ని చేరవేస్తానని ఆసుపత్రిని తనిఖీలు చేయించడం జరుగుతుందని తెలిపారు.

ఒకే వ్యక్తి.. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు..!

- ప్రభుత్వ ఖజానాకు డబుల్ ధమాకా షాక్.!
- ఏళ్ల తరబడి రెండు జీతాలా?
- ఆధార్ లింక్ తో బయటపడ్డ అసలు బాగోతం.!
- 3,300ఉద్యోగులపై వేటు పడనుందా..!
- ఇక క్రిమినల్ యాక్షన్‌కు రెడీ..!
- డబ్బుల రికవరికి రంగం సిద్ధం..!

హైదరాబాద్ డెస్క్, అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర) : ఒక ప్రభుత్వ ఉద్యోగి.. సెక్రెటేరియట్ స్కాంవెంజర్ పనిచేస్తుంది. ఆమె రెగ్యులర్ ఉద్యోగి. ఆమె ప్రతి రోజు సెక్రెటేరియట్ కు వచ్చి తన పని తాను చేసుకుని వెళ్తుంది. ఆమెనే హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ లోనూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంది. సెక్రెటేరియట్ లో ఉద్యోగం ముగించుకొని హైదరాబాద్ కలెక్టరేట్ లో ఉద్యోగం చేస్తుంది. రెండు ప్రభుత్వ ఉద్యోగాల వేతనం ఆమె తీసుకుంటుంది. వివరాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకరావడం, ఆధార్ కార్డుకు అనుసం ధానించడంతో ఆమె బాగోతం బయటపడింది.. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 3900 మంది... ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు డబుల్ శాలరీ డ్రా చేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. గుర్తించడమే కాదు వారికి జూన్ నెల నుంచి శాలరీని నిలిపివేశారు. నాలుగు నెలలుగా శాలరీలు నిలిపివేసినా కూడా ఇంత వరకు తమకు వేతనం రావడంలేదంటూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదని గుర్తించారు. అయితే వీరిలో 600 మంది వరకు పోలీసు శాఖలో నక్సల్స్ బాధిత కుటుంబాలు ఉన్నాయని, నక్సల్స్ కాల్పుల్లో, పేలుళ్లలో మరణించడంతో పోలీసు శాఖలో ఒకరికి ఉద్యోగం ఇచ్చారు.. అదే సమయంలో చనిపోయిన వారికి వారి రిటైర్మెంట్ ఏజ్ వచ్చే వరకు వేతనాన్ని జమ చేస్తున్నారు. ఇలా 600 మంది వరకు ఉండొచ్చని, మిగిలిన వారందరు అంటే దాదాపుగా 3300 వరకు బోగస్ ఉద్యోగులేనని నిర్ధారిం చారు. వీరు గత కొన్ని యేండ్లుగా రెండు శాలరీలు తీసు కుంటున్నారని, ఇలా వేల కోట్లలో నిధులు దుర్వినియోగం అయ్యాయని గుర్తించారు.

ఒకే గొడుగు కిందకు ఉద్యోగులు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఉద్యోగంలో పనిచేయకపోయినా పనిచేసినట్టుగా, ఒకే వ్యక్తి రెండు రకాలు వేతనాలు తీసుకోవడం, ప్రభుత్వ ఉద్యోగులు అయినా అధికారుల ఇళ్లలో పనిచేస్తున్నారని సీఎంకు ఫిర్యాదులు అందాయి. వీటన్నింటిపై పారదర్శకంగా వ్యవహరించేందుకు ప్రతి శాఖ ప్రభుత్వ ఉద్యోగి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వివరాలను అన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చారు. ఇందుకోసం అధికారులు పెద్ద కసరత్తే చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్తాయి ప్రతి అధికారి, ఉద్యోగి వివరా లను డిజిటలైజ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులే కాదు.. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వివరాలను సైతం నమోదు చేశారు. ఆధార్ నెంబర్ ను తప్పనిసరి చేశారు. వారి వివ రాలతో అనుసంధానించారు. సచివాలయం నుంచి దీని కోసం పెద్ద కసరత్తే చేశారు. అనేకసార్లు గడువు పొడిగించారు. వివరాలు ఇవ్వకుంటే వేతనం నిలిపివేస్తామని హెచ్చరించారు. చివరికి మే నెలలో పూర్తి వివరాలు వచ్చాయి. ఆ తరువాత డబుల్ శాలరీ తీసుకునే వారికి వేతనా లను నిలిపివేశారు. వేతనాలు నిలిపివేసే సమయంలో ఒకటికి రెండు సార్లు వెరిపై చేసుకొని వేతనాలను నిలిపివేశారు. నాలుగు నెలలుగా వేతనాలు నిలిపివేసినా ఎవరూ తమకు వేతనాలు రావడంలేదని ఫిర్యాదులు. విజ్ఞాపనలు రాకపోవడంపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఇంత ఘోరంగా ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతున్నా నియంత్రించే వ్యవస్థ లేకపోవడం, దాని గురించి ఆలోచిం చకపోవడాన్ని ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు.

క్రిమినల్ చర్యలు..

అధికారులు మరొక ముందుగు వేసి డబుల్ శాలరీ తీసుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వారిపై కేసులు పెట్టాలని, వారు తీసుకున్న శాలరీని రికవరీ చేయాలని నిర్ణయించారు. కొందరిపై కేసులు కూడా పెట్టి నట్టుగా తెలిసింది. అయితే ఈ వివరాలు బయటికి రావాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగంలో ఏదైనా తేడా వస్తే ఉద్యోగం ఊడుతుందని తెలిసినా నిర్భయంగా రెండు శాలరీలు ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని జైలుకు పంపించి, వారి నుంచి ఇప్పటి వరకు తీసుకున్న వేతనాన్ని మొత్తం రికవరీ చేయాలని, ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ వినిపిస్తుంది.

నెర్రెలు వారిన నేల.. నిస్సహాయ పాలనపై 'కవిత' కన్నెర్ర!!

- నట్టేట ముంచడం కేటీఆర్ నైజం.. చేతులెత్తేయడం రేవంత్ తత్వం
- పంటలు వేయొద్దనడం కాదు.. పరిహారం ఎక్కడ?
- కర్ణాటక బాటలో కూలీల మరణాలు.. ప్రభుత్వానిదే బాధ్యత
- రైతు కూలీలకు వెంటనే రూ. 12 వేలు, లైఫ్ ఇన్సూరెన్స్ ఇవ్వాలి
- బంజారాహిల్స్ వేదికగా నిప్పులు చెరిగిన టీఆర్ఎస్ చీఫ్



హైదరాబాద్ (పొలిటికల్ డెస్క్), అక్టోబర్ 16: తెలంగాణ నేల నెర్రెలు వారి రోదిస్తోంది. ఆకాశం వైపు చూసి కన్నీరు కారుస్తున్న కర్షకుడి కడుపు మంట ఒకవైపు.. బతుకు దెరువు లేక పొట్టచేతపట్టుకుని వలసబాట పట్టిన కూలీల ఆర్తనాదాలు మరోవైపు. పాలకులు మాత్రం ఢిల్లీ విమానాలు, గోవా దర్బార్లలో ప్రజాస్వామ్య లెక్చర్లు దంచుతున్నారు! రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు సంక్షోభం, సర్కారు ఉదాసీన వైఖరిపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మునుపెన్నడూ లేని రీతిలో విరుచుకుపడ్డారు. అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతను నిలదీస్తూనే.. ఇటు సొంత సోదరుడు కేటీఆర్ ద్వంద్వ నీతిని ఎండగడుతూ బంజారాహిల్స్ ప్రెస్ మీట్‌లో ధ్వజమెత్తారు.

ముందు తిట్టుడు బంద్ పెట్టి.. కట్టుడు షురూ చెయ్!

నిన్నటి సీఎం ప్రెస్ మీట్ పూర్తిగా ఆయన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

రూ. 12 వేల భరోసా ఏమైంది?

ఎన్నికల వేళ రైతు కూలీలకు ఇస్తామన్న రూ. 12 వేల పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

లైఫ్ ఇన్సూరెన్స్ కావాల్సిందే

భూమి లేని 40 శాతం మంది నిరుపేద కూలీల కుటుంబాలకు భద్రతగా వెంటనే జీవిత బీమా సౌకర్యం కల్పించాలి. తాగునీటి గోసలి బిందెలు పట్టుకుని మైళ్ల దూరం నడిచే మహిళల కన్నీళ్లు తుడవడానికి 'మిషన్ భగీరథ'ను యుద్ధప్రాతిపదికన చక్కదిద్దాలి

కరువు వేళ యాదాద్రి ప్రైవేటీకరణ దందా?

రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుంటే.. తెరవెనుక దోపిడీకి స్కెచ్ వేస్తున్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఎవరి ప్రయోజనాల కోసం ప్రైవేటీకరిస్తున్నారు? 'పవర్ మ్యాక్స్' కంపెనీతో సీఎం రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం ఏంటో బయటపెట్టాలి. సంక్షోభాన్ని కూడా సొమ్ము చేసుకునే దుర్మార్గమైన అవినీతి ఇది. అదుక్కుంటారో.. కొనుక్కొస్తారో మాకు అనవసరం, నవంబర్ చివరి దాకా రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి తీరాల్సిందే. దీనికోసం అవసరమైతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ల కాళ్లయినా పట్టుకుంటాం అని స్పష్టం చేశారు.

నమ్మినోళ్లను నట్టేట ముంచడం కేటీఆర్ నైజం!

ఈ ప్రెస్ మీట్‌లో కవిత చేసిన రాజకీయ వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరుపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

వెన్నుపోటు రాజకీయాలు

ఉద్యమ కాలం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ప్రతిమ శ్రీనివాస్‌పై కేటీఆర్ బొగ్గు కుంభకోణం పేరిట లేఖ రాయడం ఆయన వక్రబుద్ధికి పరాకాష్ట. రక్తం పంచుకుపుట్టిన నన్నే తిట్టించారులి సాయం చేసిన వాళ్లను, తోబుట్టువునైన నన్ను కూడా కిరాయి మనుషులతో సోషల్ మీడియాలో తిట్టించిన చరిత్ర కేటీఆర్‌ది. సొంత మనుషులనే ఉడుకు నీళ్లలో వేసి చంపే నైజం ఆయనది. అటు సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రతిమ శ్రీనివాస్‌ను కాపాడుతూ దొంగ నాటకాలు ఆడుతున్నారు అని దుయ్యబట్టారు.

సింగరేణి సభ ఒక షో-ఆఫ్

సింగరేణిలో పెట్టిన గర్జన కార్మికుల సమస్యల కోసం కాదని, కేవలం కేటీఆర్ సొంత ప్రచారం కోసమేనని తేల్చిచెప్పారు. కార్మికులకు మెడికల్ బోర్డు సాధన కోసం పోరాడేది తామేనని, రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్-హెచ్ఎంఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అటు అధికార పక్షపు అసమర్థతను చీల్చిచెండాడుతూనే, ఇటు అంతర్గత ద్రోహాలను నిర్భయంగా బట్టబయలు చేసిన కవిత ప్రెస్ మీట్.. తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. నెర్రెలు వారిన నేల సాక్షిగా పాలకులకు హెచ్చరికలు జారీ చేస్తూ, రైతాంగానికి అండగా నిలబడతామని ఆమె తేల్చిచెప్పారు.

- గడ్డం సంతోష్ రాజ్
స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర

రూ.1.50 కోట్ల నగదుతో ధనలక్ష్మి దేవిగా తాయమ్మవ్వ దర్శనం

గద్వాల అక్టోబర్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): దసరా శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా గద్వాల పట్టణంలోని బీరెల్లి రోడ్డు రెండో వార్డులో వెలసిన శ్రీశ్రీశ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మవ్వ ఆలయంలో ఆరో రోజు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండో వార్డు కౌన్సిలర్ లక్ష్మీనర్సమ్మ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.1.50 కోట్ల నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. నగదు అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ధనలక్ష్మి దేవి రూపంలో తాయమ్మవ్వ దర్శనంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో కళకళలాడుతుంది.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.